ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా
చిరునవ్వుతో
ఎదుర్కొనగలవారే గొప్పవారు
- స్వామి వివేకానంద

Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 53 | గురువారం 01 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## మరింత వ్యూహాత్మక మైత్రి

- భారత్- మధ్య సమగ్ర గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్‌పై ఫోకస్
- ఫోన్లో ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించిన ప్రధాని మోదీ, ట్రంప్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

భారత్–, అమెరికా దేశాల మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం (సమగ్ర గ్లోబల్ (స్ట్రాటజిక్ పార్టనర్షిప్) మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రధాని నరేంద్రమోదీ(గ్రావీ చీఘ్తీవఅుత్ఘు వీశీుఱ), అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలలో పురోగతిని సమీక్షించేందుకు మోదీ బుధవారం ట్రంప్‌తో టెలిఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ చర్చలో వాణిజ్యం, రక్షణ, ఇంధనంతో సహా పరస్పర ఆసక్తి ఉన్న ప్రధాన రంగాలు, వ్యూహాత్మక సహకారంపై దృష్టి సారించారు. 'లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' అమల్లోకి వచ్చిన తర్వాత పెరిగిన వాణిజ్య ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాధినేతలు చర్చించుకోవ డం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చట్టం, రష్యా చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే భారత్, చైనాతో సహా ఇతర దేశాలపై 100 శాతం వరకు సుంకాలను విధించడానికి అధికారం ఇస్తుంది.

ప్రధానమంత్రి కార్యాలయం జారీ చేసిన ప్రకటన ప్రకారం.. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే ప్రపంచ శాంతి, భద్రతలను ప్రోత్సహించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై

- మిగతా 2లో..

# 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

- సీఈసీ, సర్‌పై ఐక్యపోరు
- 2 నుంచి 8 వరకు ఆందోళన
- 6న ప్రతిపక్ష ఎంపీలందరూ ఈసీ ఆఫీసుకు పాదయాత్ర
- ఇండియా కూటమి సంయుక్త కార్యాచరణ ఖరారు
- డీఎంకే, ఆప్, సమాజ్‌వాదీ డుమ్మా.. వర్చువల్‌గా యూబీటీ, జేఎంఎం



న్యూఢిల్లీ– సూర్య వాస్తవం :

దేశంలో సర్ వివాదంపై ర్యాలీలు, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' యాత్రలతో సహా ఒక సంయుక్త కార్యాచరణ ప్రణాళికను ఇండియా బ్లాక్ బుధవారం ఖరారు చేసింది. సీఈసీ, సర్ తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని స్పష్టం చేసింది. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు జరపాలని సమావేశంలో అన్ని పార్టీలు అంగీకరించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు 'సేవ్ డెమోక్రసీ' మార్చ్ నిర్వహిస్తామని, అలాగే 6న ప్రతిపక్ష ఎంపీ లంద రూ ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రధాన కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, జ్ఞానేశ్‌కుమార్ దాడి చేశారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.

దేశంలో ఓట్ల కుంభకోణం జరిగిందని పశ్చిమబెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సీఈసీ జ్ఞానేష్‌ను తక్షణమే తొలగించాలని 19 ప్రతిపక్ష పార్టీల నేతలు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. బుధవారం న్యూఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ సెంటర్ భవనంలో నిర్వహించిన ఇండియా బ్లాక్ ఈ కీలక సమావేశానికి డీఎంకే, ఆప్‌తో సహా సమాజ్‌వాదీ పార్టీలు గైర్హాజరు అయ్యాయి. యూబీటీ, జేఎంఎం మాత్రం వర్చువల్‌గా పాల్గొనడం గమనార్హం. ఈ ముఖ్య సమావేశానికి మల్లికార్జునఖర్గే, కాంగ్రెస్ మాజీ అధినేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే తదితర నాయకులు హాజరయ్యారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన సంయుక్త బ్రీఫింగ్‌లో మల్లికార్జునఖర్గే మాట్లాడుతూ.. సీఈసీ, సర్ అక్రమాలపై తాము ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని అన్నారు.

యువత, ఎన్జీవోలను

- మిగతా 2లో..



## డీఎంకేకు అనుబంధ సంస్థగా అన్నాడీఎంకే

- సీఎం విజయ్ సంచలన ఆరోపణ
- ఎంజీఆర్, జయలలిత ఆశయాలకు ఇది ద్రోహం చేయడమేనని విమర్శ
- ధర్మపురి ఉపఎన్నిక ప్రచారంలో పలు సంక్షేమ పథకాలను ప్రకటించిన విజయ్
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో వేడెక్కిన తమిళనాడు ఉపఎన్నిక రాజకీయం

చెన్నై – సూర్య వాస్తవం

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్, ప్రతిపక్ష అన్నా డీఎంకేపై సంచలన ఆరోపణలు చేశారు. ఒకప్పుడు బీజేపీకి చేరువగా ఉన్న అన్నాడీఎంకే, ప్రస్తుతం ప్రతిపక్ష డీఎంకేకు అనుబంధ సంస్థగా

- మిగతా 2లో..

# పేదలకు పట్టాభిషేకం

- విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఇంటి పట్టాల పంపిణీ
- రూ.28,112 కోట్ల విలువైన భూములపై హక్కులు కల్పించిన ప్రభుత్వం
- పేదల ఆత్మగౌరవానికి ఇది పట్టాభిషేకం అని పేర్కొన్న సీఎం చంద్రబాబు
- అభివృద్ధికి గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని తీవ్ర విమర్శలు
- వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి నీళ్లు అందిస్తామని హామీ





విజయవాడ– సూర్య వాస్తవం

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిల బెట్టుకుంటూ ముందుకు సాగు తోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతోందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో దశాబ్దాలుగా అపరిష్కృ తంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, విజయవాడలో 26,401 పేద కుటుంబాలకు ఆయన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. సోమ వారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'పేదల కు పట్టాభిషేకం' పేరిట నిర్వ హించిన బహిరంగ సభలో ముఖ్య మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భం గా చంద్రబాబు మాట్లా డుతూ, "విశాఖపట్నంలో 28 వేల మందికి, మంగళగిరిలో 5,800 కుటుంబా లకు ఇప్పటికే పట్టాలు అందజేశాం. ఇప్పుడు విజయ వాడలో 26,401 కుటుంబాలకు రూ.28,112 కోట్ల విలువైన 707 ఎకరాల భూములపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం. ఇది పేదల ఆత్మగౌరవానికి మా ప్రభుత్వం చేస్తున్న పట్టాభిషేకం" అని పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం

- మిగతా 2లో..

## సిరిసిల్లలో రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం

- సంక్షేమం.. అభివృద్ధితో తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం - నేతన్నలకు అండగా ప్రభుత్వం..
- నేరెళ్ల బాధితులకు ఆర్థిక సహాయం: సీఎం రేవంత్‌రెడ్డి
- విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం
- చేనేత, గల్ఫ్ కార్మికులు, సంక్షేమ పథకాలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



సిరిసిల్ల – సూర్య వాస్తవం :

ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన––ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లాలో రూ.345.78 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. సిరిసిల్ల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన నేతన్న బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. చేనేత, వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల ప్రధాన కేంద్రంగా ఉందని, వేలాది కుటుంబాలు ఈ రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. అగ్గిపెట్టెలో చీరను మడతపెట్టే నైపుణ్యం సిరిసిల్ల నేతన్నల ప్రత్యేకతగా

- మిగతా 22లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ..

- ఉద్యోగులకు నిరంతర నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న సీఎం
- ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- వర్చువల్ కోర్సులతో స్కిల్స్ పెంచుకోవాలని సూచన
- తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దని ఆదేశాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

2లో



# మరింత వ్యూహాత్మక మైత్రి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. భారత్- సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తమ నిబద్ధతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనం కోసం సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవ డానికి సన్నిహిత సంబంధాలను కొనసాగించడానికి అంగీకరించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికత లు, పరస్పర ఆసక్తి ఉన్న ఇతర రంగాలలో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన పురోగతిని కూడా సమీక్షించారు. ట్రంప్‌తో తాను ఫలవంతమైన సంభాషణ జరిపినట్లు మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను కలిశారు. ఈ చర్చల్లో రష్యా, ఇరాన్లపై ఆంక్షల చట్టం (ఎస్ఆర్ఐఏ)కు సంబంధించిన భారతదేశ ఆందోళనలు ప్రస్తావనకు వచ్చాయి.
వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం కోసం అమెరికాలో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో సమావేశం కానున్నారు. భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బీటీఏ) ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలలో భాగంగా, అలాగే ఫిబ్రవరి 7, 2026 నాటి ఉమ్మడి ప్రకటనకు అనుగుణంగా మధ్యంతర ఒప్పందాన్ని ఖరారు చేసే దిశగా గోయల్ ఆయనతో ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు.

# పేదలకు పట్టాభిషేకం



(మొదటి పేజీ తరువాయి)

60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన భూములను అందించడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

**గొడ్డలి పార్టీ అంటూ తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019-24 మధ్య పాలకులు ప్రతి ఇంట్లో ఆస్తుల వివాదాలు సృష్టించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ప్రజలను భయాందోళనకు గురిచేశారు. సర్వే రాళ్లపై తమ బొమ్మలు ముద్రించుకోవడం కోసం రూ.800 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేశారు. ఇప్పుడు మేము రాజముద్రతో కూడిన వివాదరహిత పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నాం" అని వెల్లడించారు. పురాణాల్లో యజ్ఞాలకు రాక్షసులు అడ్డుపడినట్లు, తాము చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనికి గొడ్డలి పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాయడం, చెరకు తోటలను తగలబెట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు.

**అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం**

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "పట్టిసీమను అడ్డుకోవాలని చూసినా, పట్టుదలతో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీరందించాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేస్తాం. అలాగే రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను మూడేళ్ల కాలంలో పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని, కేంద్ర గణాంకాల ప్రకారం విమెన్ వర్క్ ఫోర్సులో విశాఖపట్నం, విజయవాడ నగరాలు దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేదలందరికీ సొంత ఇల్లు, ఇంటి స్థలం, కుళాయి కనెక్షన్ అందించడమే కూటమి ప్రభుత్వ అంతిమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీఎంకేకు అనుబంధ సంస్థగా అన్నాడీఎంకే

(మొదటి పేజీ తరువాయి)

మారిపోయిందని విమర్శించారు. తిరుప్పూర్ జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు.

అక్టోబర్ 6న జరగనున్న ఉపఎన్నికలో టీవీకే అభ్యర్థి సత్యభామ తరఫున విజయ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డీఎంకే, అన్నాడీఎంకే పార్టీల పనితీరు, ప్రయోజనాలు ఒక్కటేనని ఆరోపించారు. ఇది దివంగత నేతలు ఎంజీఆర్, జయలలితల ఆశయాలకు ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. "దుష్టశక్తి" అయిన డీఎంకేకు అసలైన ప్రత్యామ్నాయం తమ పార్టీయేనని, అందుకే సత్యభామను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. తాను కేవలం ముఖ్యమంత్రిగానే కాకుండా, ప్రజలందరికీ "మేనమామ"గా అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిన సంక్షేమ పథకాలను సీఎం విజయ్ గుర్తుచేశారు. 717 టాస్మాక్ దుకాణాల మూసివేత, మహిళ రక్షణ కోసం "సింగప్పెన్ స్పెషల్ ఫోర్స్" ఏర్పాటు, మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలు, వరి, పాల సేకరణ ధరల పెంపుతో పాటు నవజాత శిశువుల కోసం ప్రవేశపెట్టిన "తైమామన్ గోల్డ్ రింగ్" వంటి పథకాలను వివరించారు. అలాగే మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం అక్టోబర్ 3 నుంచి "వెట్రి పయనం" పేరుతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విస్తరిస్తున్నట్లు, "అన్నపూరణి సూపర్ సిక్స్" ఎల్పీజీ పథకాన్ని కూడా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ధర్మపురి అన్నాడీఎంకే సిట్టింగ్ ఎమ్మెల్యే సత్యభామ తన పదవికి రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో ఇక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. సాంప్రదాయంగా అన్నాడీఎంకేకు కంచుకోట అయిన ఈ నియోజక వర్గంలో ఫిరాయింపుల వల్లే ఎన్నికలు వచ్చాయని ఆ పార్టీ నేతలు విమర్శిస్తుండగా, విజయ్ చేసిన తాజా ఆరోపణలతో ధర్మపురి ఉపఎన్నిక ప్రచారం మరింత వేడెక్కింది.

# 'సేవ్ డెమోక్రసీ' మార్చ్




(మొదటి పేజీ తరువాయి)

భాగస్వాములను చేస్తూ, శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు 'సేవ్ డెమోక్రసీ' అనే నినాదంతో పాదయాత్రలు చేపట్టాలని, జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ముందు ప్రదర్శనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ నెల 6న ప్రతిపక్ష ఎంపీలందరూ ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారని ఆయన తెలిపారు. 'ఓటు దొంగ ప్రభుత్వానికి' వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరి, అక్టోబర్ రెండో వారంలో వినతిపత్రం సమర్పిస్తారని పేర్కొన్నారు. ఇండియా కూటమి ఐదు భారీ ర్యాలీలు నిర్వహిస్తుందని, వాటి తేదీ, ప్రదేశం త్వరలో నిర్ణయిస్తామని అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో ఒక భారీ ర్యాలీని నిర్వహిస్తామని ఖర్గే తెలిపారు. ఎస్ఐఆర్, ఎన్నికల అవకతవకల కేసులను వేగవంతం చేయాలని భారత కూటమి నాయకులు సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారని ఖర్గే అన్నారు. 'రాహుల్ జీ చెప్పింది సరైనదేనని ఇప్పుడు అందరూ గ్రహిస్తున్నారు. అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మొదట ప్రధాని మోదీ 'నోట్ల రద్దు' చేశారు. ఇప్పుడు ప్రజల హక్కులను హరిస్తూ 'ఓట్ల రద్దు' చేస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పద్ధతికి తిరిగి వెళ్లాలని, ఇకపై అన్ని ఎన్నికలూ బ్యాలెట్ ద్వారానే జరగాలని, అలాగే అధి కారంలో ఉన్న ఈ 'దొంగ ప్రభుత్వం' చేసిన చట్టాలను రద్దు చేయాలని అందరూ వంద శాతం అంగీకరించారని ఖర్గే చెప్పారు.

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, జార్ఖండ్ ముఖ్యమంత్రి, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్ వంటి కొందరు నాయకులు ఆన్లైన్ ద్వారా పాల్గొన్నారని ఆయన తెలిపారు. అందరూ ఏకగ్రీవంగా కలిసి పోరాడాలని ప్రతిజ్ఞ చేశారని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్‌ను నిజంగా నియంత్రించే 'సూత్ర ధారులు' మోదీ, హోంమంత్రి అమిత్ షా అని ఖర్గే ఆరో పించారు. అక్కడ కనిపించే వ్యక్తులు కేవలం పావులు మాత్రమే నని, ఓట్ల దొంగతనం వెనుక ప్రధాని, హోం మంత్రి ఉన్నారని, అందుకే వారు ఎన్నికల్లో గెలుస్తున్నా రని విమర్శించారు. అందుకే ప్రజాస్వా మ్యం కోసం పోరాడుతున్న వారిని వారు వేధిస్తున్నారని పేర్కొన్నారు.

**ముగ్గురి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం ధ్వంసం..**

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ దాడి చేశారన్నదే అన్ని పార్టీల అభి ప్రాయ మని రాహుల్ గాంధీ అన్నారు. తాము దీనిని చూస్తూ ఊరుకోమని, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిన వారికి శిక్ష పడేలా చేస్తామని తెలిపారు. ప్రధాని, హోంమంత్రి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేశారని, ఎన్నికలను అపహరించారని ప్రజలకు తెలియజేయడంలో ప్రతిప క్షం బాగా విజయం సాధించిందని రాహుల్ గాంధీ చెప్పారు. 'రాజ్యాంగాన్ని సమిష్టిగా రక్షించాల్సిన బాధ్యత ప్రతిపక్ష నాయకులం దరిపై ఉందన్నారు.

**ప్రజల ఓట్లను దొంగిలించారు: మమత**

దేశంలో ఒక 'పెద్ద కుంభకోణం' జరిగిందని.. అదే.. ఓట్ల దోపిడీ అయ్యాయని, దాని పర్యవసానాలను ప్రజలు అనుభవిస్తున్నారని మమ తా బెనర్జీ అన్నారు. ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై బీజేపీ వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని ఆమె ఆరోపించారు. కానీ ఇప్పుడు జ్ఞానేష్ కుమార్ ఒక దొంగ, దోపిడీదారుడు అని బయటపడిందని చెప్పారు. ఆయన ప్రజల ఓట్లను దొంగిలించారని, ఈవీఎం యంత్రాలను తగులబెట్టారని, ఓట్ల లెక్కింపులో అవకతవకలకు పాల్పడ్డారని కాబట్టి, జ్ఞానేష్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**మూడు ప్రధాన పార్టీలు డుమ్మా**

ఈ సమావేశా నికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ), శివసేన (యూబీటీ), రాష్ట్రీయ జనతా దళ్, సీపీఐ(ఎం), సీపీఐ, జమ్మూ అండ్‌కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, జమ్మూ అండ్ కశ్మీర్ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, జార్ఖండ్ ముక్తి మోర్చా, సీపీఐ-ఎంఎల్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (ఎం), మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం, విదుతలై చిరుతైగళ్ కచ్చి, రివల్యూష నరీ సోషలిస్ట్ పార్టీ, కేరళ కాంగ్రెస్(జాకబ్), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు హాజరయ్యాయి. స్వతంత్ర రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కూడా హాజరయ్యారు. కానీ డీఎంకే, ఆప్, సమాజ్‌వాదీ డుమ్మా కొట్టగా, యూబీటీ, జేఎంఎం పార్టీలు వర్చువల్‌గా పాల్గొన్నాయి. ఎంతో కీలకమైన ఈ సమావేశానికి ప్రధాన పార్టీలే రానప్పుడు ప్రాంతీయ పార్టీలతో కొత్త పొత్తులకు ఇండియా బ్లాక్ పోనున్నదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

## సిరిసిల్లలో రూ.345.78 కోట్ల
# అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

నిలిచిందని అన్నారు. ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన నైపుణ్యం కలిగిన నేత కార్మికులు ఈ ప్రాంతంలో ఉన్నారని తెలిపారు. చేనేత, పవర్‌లూమ్, చేతివృత్తులపై ఆధారపడే కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. చేనేత రంగానికి గత పదేళ్లలో రూ.2,234 కోట్లు ఖర్చు కాగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండున్నరేళ్లలో రూ.1,751 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమంతో పాటు రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

సిరిసిల్ల, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గల్ఫ్ దేశాల్లో ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందిన సందర్భాల్లో వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నూతన రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వివరించారు. అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

సిరిసిల్లతో పాటు వేములవాడలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు కల్పించేలా ఈ సంస్థలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సిరిసిల్ల, వేములవాడల్లో రెండు ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేముల వాడ రూరల్, రుద్రంగిలో తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, సిరిసిల్ల, వేములవాడల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. సిరిసిల్ల అభివృద్ధిలో భాగంగా నేతన్న బజార్‌తో పాటు విద్య, పరిపాలన, పోలీస్, గిడ్డంగులు, మహిళా సాధికారత వంటి రంగాలకు సంబంధించిన మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు.



జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటన బాధితులకు ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం అందించారు. బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని గతంలో వివిధ వర్గాల నుంచి వచ్చిన డిమాండ్లను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యానికి తగిన మార్కెట్ అవకాశాలు కల్పించడం, యువతకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించడం, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతాయని ముఖ్య మంత్రి తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా కొనసాగిస్తూ సిరిసిల్ల జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ వెం నరేందర్‌రెడ్డి, తో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉద్యోగులకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ..

- ఉద్యోగులకు నిరంతర నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న సీఎం చంద్రబాబు
- ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- వర్చువల్ కోర్సులతో స్కిల్స్ పెంచుకోవాలని సూచన
- తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దని ఆదేశాలు
- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

**అమరావతి - సూర్య వాస్తవం :**
ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతరం కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉద్యోగులకు అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు ఐఐటీ, ఐఐఎంలతో శిక్షణ ఇప్పించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలు అందిస్తున్న సేవలపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్య శిక్షణ, అన్న క్యాంటీన్లు, పట్టణాల్లో తాగునీటి సరఫరా, సంక్షేమ హాస్టళ్లలో వసతులపై చర్చించారు. కెపాసిటీ బిల్డింగ్, నైపుణ్య శిక్షణలో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని చంద్రబాబు చెప్పారు. ఐగాట్ కర్మయోగి ద్వారా ఉద్యోగులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. రియల్‌టైమ్‌లో పనిచేసేలా ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. వర్చువల్ కోర్సుల ద్వారా కూడా తమ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని చెప్పారు. ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ఓరియెంటేషన్ తీసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటారని.. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరమని సీఎం అన్నారు. పట్టణాల్లో తాగునీటి సమస్యపై కూడా సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో పట్టణాల్లో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని అధికారులు తెలిపారు. రాయలసీమలో రెండు మున్సిపాలిటీల్లో స్వల్పంగా సమస్య ఉందని, దాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విశాఖపట్నంలో భూగర్భ జలాలు రీఛార్జ్ కావడంతో తాగునీటి సమస్యను అధిగమిస్తున్నామని అధికారులు వివరించారు. పట్టణాలు, గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. వర్షాలు కురిశాయని నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సీఎం చెప్పారు. సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## లోకల్ బాడీ ఎన్నికలు యధాతథం




**విజయవాడ -సూర్య వాస్తవం :** స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసు కుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 20 26 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

## ఘనంగా కాశీ విశ్వనాథ్ ప్రథమ వర్ధంతి

### - ప్రజా, కార్మిక, విద్యార్థి సమస్యలపై ఆయన సేవలు చిరస్మరణీయం:

### ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.నాగరాజు



**పత్తికొండ -సూర్య వాస్తవం :** జిల్లా ప్రజానాట్యమండలి, మాజీ ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు, న్యాయవాది జే.కాశీ విశ్వనాథ్ ప్రథమ వర్ధంతిని బుధవారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.మండల ప్రజానాట్యమండలి అధ్యక్షుడు వై.రమేష్, కార్యదర్శి బి.శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కర్నూలు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.నాగరాజు, సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి,బీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాల్మీకి అంజి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.సాల్ రంగడు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాశీ విశ్వనాథ్ విద్యార్థి దశ నుంచే బడుగు, బలహీన వర్గాలు, పేద ప్రజలు, కార్మికులు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ ప్రజాసేవకు అంకితమయ్యారని గుర్తు చేశారు. ప్రజానాట్యమండలి ద్వారా పలు సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం కల్పించారు.కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, గోపాలు, సిద్ధయ్యగౌడ్, మద్దికెర సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, విద్యార్థి యువజన సంఘాల నాయకులు గిత్తరి రమేష్, సురేంద్ర, మధు, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తకన్న, కోశాధికారి బాలు, కర్ణాకర్, సరిత, లక్ష్మి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రసాద్, దళిత సంఘం నాయకులు శీను, సీనియర్ విలేకరి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ఎదుగుదల

## ప్రతిపక్ష నేత నుంచి జాతీయ రాజకీయ ప్రత్యామ్నాయం వరకు

భారత రాజకీయాల్లో రాహుల్ గాంధీకి సంబంధించిన ప్రజా రాజకీయ ప్రతిఛాయలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు రాజకీయ ప్రత్యర్థులు, మీడియాలోని కొన్ని వర్గాల నుంచి తరచూ విమర్శలు ఎదుర్కొన్న కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కొనసాగుతూ, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ప్రధాన ప్రతిపక్ష స్వరాల్లో ఒకరిగా నిలిచారు.కాంగ్రెస్ పార్టీ, దాని మద్దతుదారుల దృష్టిలో ఈ పరిణామం కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రతిఛాయలో వచ్చిన మార్పు మాత్రమే కాదు. రాజ్యాంగం, సామాజిక న్యాయం, ఆర్థిక అవకాశాలు, సంస్థాగత జవాబుదారీతనం, సామాన్య ప్రజల హక్కులను కేంద్రంగా చేసుకుని ప్రత్యామ్నాయ రాజకీయ దృక్పథాన్ని స్పష్టంగా వినిపించగల నాయకుడిగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని వారు భావిస్తున్నారు.2024 జూన్ 9న రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా అధికారికంగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత పార్లమెంటులో ఆయన చేసిన ప్రసంగాలు, జోక్యాలు ఉపాధి, కనీస వేతనాలు, విద్య, ఆహార భద్రత, ఆదివాసీల పునరావాసం, విద్యార్థుల సంక్షేమం, ఎన్నికల సంస్కరణలు వంటి అనేక అంశాలను స్పృశించాయి. పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ నమోదు చేసిన పార్లమెంటరీ గణాంకాల ప్రకారం, 2026 ఆగస్టు 13 నాటికి 18వ లోక్‌సభలో ఆయన 17 చర్చల్లో పాల్గొని, 64 ప్రశ్నలు అడిగారు.



### నిరంతర ప్రతిపక్ష స్వరంగా ఎదుగుదల

రాహుల్ గాంధీ రాజకీయ ప్రయాణంలో అత్యంత స్పష్టంగా కనిపిస్తున్న అంశం ఆయన ప్రజా ప్రసంగం, రాజకీయ కమ్యూనికేషన్‌లో వచ్చిన మార్పు.రాజకీయ ప్రత్యర్థులు విస్తృతంగా ఉపయోగించిన "పప్పు" అనే వ్యంగ్య ప్రతిరూపం ఆయనను రాజకీయ అనుభవం లేని వ్యక్తిగా చూపించే ప్రయత్నంగా ఉండేది. ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీ రాజకీయ కార్యకలాపాలు ఈ అభిప్రాయాన్ని మార్చే దిశగా సాగుతున్నాయి. ప్రభుత్వాన్ని నేరుగా ప్రశ్నించడం, సంస్థల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తడం, రాజకీయ అంశాలను ప్రజల ముందుకు నేరుగా తీసుకెళ్లడం వంటి వైఖరిని ఆయన ప్రదర్శిస్తున్నారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.ఈ పునఃస్థాపనలో భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర కీలక పాత్ర పోషించాయి. ఈ రెండు యాత్రల ద్వారా రాహుల్ గాంధీ దేశంలోని విస్తృత ప్రాంతాల్లో పర్యటించి రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, అణగారిన వర్గాలతో నిరంతరంగా మమేక మయ్యారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విశ్లేషణ ప్రకారం, ఈ రెండు యాత్రలు సాగిన మార్గాల్లోని నియోజకవర్గాల్లో కాంగ్రెస్, దాని ఇండియా కూటమి భాగస్వాములు గత ఎన్నికలతో పోలిస్తే 41 లోక్‌సభ స్థానాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. అయితే ఈ ఫలితాలకు యాత్రలే ఏకైక కారణమని నిర్ధారించలేం. అయినప్పటికీ, యాత్రలు జరిగిన ప్రాంతాల్లోని అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఎన్నికల పనితీరు మెరుగుపడిన కాలంతో ఈ ప్రచారాలు సమకాలీనంగా సాగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

### కాంగ్రెస్‌ను దాటి విస్తరిస్తున్న రాజకీయ పరిధి

రాహుల్ గాంధీ రాజకీయ ప్రచారం సంప్రదాయ పార్టీ రాజకీయాలకు మించి కొన్ని విస్తృతమైన అంశాల చుట్టూ రూపుదిద్దుకుంటోంది.రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సంస్థల జవాబుదారీతనం వంటి అంశాలపై ఆయన పదేపదే దృష్టి సారిస్తున్నారు. వీటి ఆధారంగా అధికారంలో ఉన్న రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయ రాజకీయ కథనాన్ని రూపొందించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.విద్యార్థులతో ఆయన ఇటీవలి మమేకం ఈ విధానానికి ఒక ఉదాహరణగా కనిపిస్తోంది."ఛాత్రోంకీ గూంజ్" కార్యక్రమం ద్వారా యువ భారతీయులతో నేరుగా రాజకీయ సంభాషణకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారు. సెప్టెంబర్ 19న ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో విద్య, ఉపాధి, ప్రస్తుత అధికార వ్యవస్థలను ప్రశ్నించాల్సిన అవసరం వంటి అంశాలపై ఆయన ప్రధానంగా మాట్లాడారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం, ఇది విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న ఈ కార్యక్రమంలో ఐదో విడత.ఈ కార్యక్రమాల రాజకీయ ప్రాధాన్యత ఏమిటంటే, యువతను కేవలం ఓటర్ల వర్గంగా కాకుండా, విస్తృత ప్రజాస్వామ్య సంభాషణలో భాగస్వాములుగా చూడాలనే ప్రయత్నంగా దీనిని కాంగ్రెస్ వర్గాలు అభివర్ణిస్తున్నాయి.

### ఎన్నికల సమగ్రతపై ప్రత్యక్ష పోరాటం

రాహుల్ గాంధీ ప్రస్తుత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత పొందిన అంశాల్లో ఎన్నికల సమగ్రత ఒకటి.ఎన్నికల జాబితాల్లో అవకతవకలు ఉన్నాయంటూ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ పదేపదే ఆరోపణలు చేస్తూ, దీనిని "ఓట్ చోరీ"గా అభివర్ణించారు. 2026 సెప్టెంబర్ 23, 24 తేదీల్లో ఆయన ఈ అంశాన్ని మరింత తీవ్రంగా ప్రస్తావిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు సమగ్రత ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతకు ప్రాథమికమైనదని ఆయన వాదించారు.ఈ ఆరోపణల నేపథ్యంలో ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనాల ప్రకారం, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియతో పాటు ఇతర ఎన్నికల అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేశారు.అయితే, ఈ అభ్యంతరాలు సంస్థాగత విభేదాలకు సంకేతమన్న వ్యాఖ్యానాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. నిర్ణయ ప్రక్రియలో కార్యాచరణకు సంబంధించిన ప్రశ్నలు, సూచనలు సహజమైనవేనని, ఎస్ఐఆర్ అంశంపై తమ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని ఎన్నికల సంఘం పేర్కొంది.అందువల్ల ఈ ఆరోపణలు రాజకీయంగా వివాదాస్పదంగానే ఉన్నాయి. అయితే ఎన్నికల పారదర్శకతను జాతీయ రాజకీయ ప్రచారంలో ప్రధాన అంశంగా రాహుల్ గాంధీ ముందుకు తీసుకు రావడం కాంగ్రెస్ చేస్తున్న విస్తృత వాదనను ప్రతిబింబిస్తోంది. ఓటు హక్కు రక్షణ, రాజ్యాంగం మరియు ప్రజాస్వామ్య పరిరక్షణతో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని కాంగ్రెస్ వాదిస్తోంది.

### ఇండియా కూటమి -- జాతీయ ప్రతిపక్షం

రాహుల్ గాంధీ జాతీయ రాజకీయాల్లో పెరుగుతున్న పాత్రను విస్తృత ప్రతిపక్ష కూటమి నుంచి వేరు చేసి చూడలేం.ఇండియా కూటమిలో విభిన్న రాజకీయ, సిద్ధాంత నేపథ్యాలు కలిగిన పార్టీలు, బలమైన ప్రాంతీయ ప్రయోజనాలు కలిగిన సంస్థలు ఉన్నాయి. ఇలాంటి కూటమిని కొనసాగించడం సహజంగానే సంక్లిష్టమైన ప్రక్రియ. అయినప్పటికీ, జాతీయ స్థాయిలో ప్రతిపక్షానికి ప్రధాన ముఖాల్లో ఒకరిగా కాంగ్రెస్ రాహుల్ గాంధీని క్రమంగా ముందుకు తీసుకువస్తోంది.కాంగ్రెస్ మద్దతుదారుల దృష్టిలో రాహుల్ గాంధీ ప్రాధాన్యత ఆయన పార్టీ పరిమితులను దాటి జాతీయ స్థాయిలో ఒక రాజకీయ సందేశాన్ని తీసుకెళ్లగల సామర్థ్యంలో ఉంది. ఆర్థిక అవకాశాలు, సామాజిక న్యాయం, సంస్థల స్వతంత్రత, రాజ్యాంగ హక్కులను ఒకే జాతీయ రాజకీయ కథనంలో అనుసంధానించేందుకు ఆయన ప్రచారాలు ప్రయత్నిస్తున్నాయి.2029 ఎన్నికలకు ప్రతిపక్షం ఒకే ప్రధానమంత్రి అభ్యర్థిని ఎన్నుకుంటుందా అనే విషయం ఇంకా నిర్ణయించబడలేదు. అయితే ప్రతిపక్ష రాజకీయాల్లో రాహుల్ గాంధీ స్థానం గతంతో పోలిస్తే ప్రాధాన్యత పొందిందన్నది స్పష్టమైన రాజకీయ పరిణామం.

### కాంగ్రెస్‌కు సవాలు – రాహుల్‌కు అవకాశం

అయితే ఈ మార్పును అతిశయోక్తి చేయడం కూడా సరికాదు. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఇప్పటికీ సంస్థాగత బలహీనతలను ఎదుర్కొంటోంది. రాహుల్ గాంధీ వ్యక్తిగత రాజకీయ ప్రాచుర్యం పెరగడం మాత్రమే అన్ని రాష్ట్రాల్లో సమానమైన ఎన్నికల విజయంగా మారలేదు.విద్యార్థులతో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వచ్చిన ఇటీవలి విశ్లేషణలు కూడా రాహుల్ గాంధీ వ్యక్తిగత ప్రజా ప్రాచుర్యానికి, కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి సంస్థాగత బలానికి మధ్య ఇంకా అంతరం ఉందని సూచిస్తున్నాయి.అయితే రాహుల్ గాంధీ రాజకీయాల తదుపరి దశను నిర్ణయించేది ఇదే అంశం కావచ్చు.పెరుగుతున్న ప్రజా మమేకాన్ని సంస్థాగత పునరుజ్జీవనంగా మార్చడం, పార్లమెంటరీ జోక్యాలను నిరంతర ప్రత్యామ్నాయ విధాన కార్యాచరణగా రూపొందించడం, ప్రతిపక్ష పార్టీల సహకారాన్ని స్థిరమైన రాజకీయ కూటమిగా మార్చడం ఆయన ముందున్న ప్రధాన సవాళ్లుగా కనిపిస్తున్నాయి.

### కొత్త రాహుల్ గాంధీ?

రాహుల్ గాంధీ రాజకీయ ప్రయాణం ఇక పాత మీడియా ప్రతిఛాయను అధిగమించడం అనే అంశానికే పరిమితం కాదు. తన ముందుకు వచ్చిన రాజకీయ స్థలాన్ని ఆయన ఎంతవరకు స్థిరీకరించగలరన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.ఆయన మద్దతుదారుల దృష్టిలో దేశవ్యాప్తంగా పర్యటించి ప్రజల మాట విన్న నాయకుడిగా, పార్లమెంటులో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతగా, అసమానతలపై నిరంతరం మాట్లాడుతున్న రాజకీయ నాయకుడిగా, రాజ్యాంగాన్ని తన రాజకీయ వాదనలో కేంద్రంగా ఉంచుతున్న నేతగా రాహుల్ గాంధీ కొత్త రూపంలో కనిపిస్తున్నారు.అయితే ఆయన విమర్శకులు మాత్రం ఆయన ఎన్నికల వ్యూహం, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సామర్థ్యం, ఆయన వ్యక్తిగత రాజకీయ ప్రాచుర్యాన్ని ఓట్లుగా మార్చగల సామర్థ్యంపై ప్రశ్నలు కొనసాగిస్తున్నారు. **అయినప్పటికీ ఒక వాస్తవాన్ని విస్మరించడం కష్టం:** దశాబ్దం క్రితంతో పోలిస్తే నేడు భారత జాతీయ రాజకీయాల్లో రాహుల్ గాంధీ మరింత ప్రాధాన్యత కలిగిన రాజకీయ స్థానాన్ని ఆక్రమించారు.ఈ మార్పును మరింత బలోపేతం చేసుకునే అవకాశం కాంగ్రెస్ ముందుంది. పెరుగుతున్న జాతీయ స్థాయి ప్రజా ప్రాచుర్యాన్ని సంస్థాగత పునర్నిర్మాణం, విస్తృత ప్రతిపక్ష సమన్వయం, స్పష్టమైన విధాన కార్యక్రమంతో అనుసంధానించగలిగితే, భారత రాజకీయ దిశపై జరిగే పోటీలో రాహుల్ గాంధీ పాత్ర మరింత ప్రాధాన్యత పొందే అవకాశం ఉంటుంది.కాంగ్రెస్ దృష్టిలో రాహుల్ గాంధీ కథ ఇక కేవలం రాజకీయ మనుగడకు సంబంధించినది కాదు. పునర్నిర్మాణం, ప్రతిఘటన, జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కోసం అన్వేషణగా ఆ పార్టీ దీనిని ముందుకు తీసుకెళ్తోంది.ఈ రాజకీయ పరిణామం చివరకు ఏ స్థాయి ప్రజా మద్దతుగా మారుతుందో భారత ఓటర్లు నిర్ణయిస్తారు. అప్పటివరకు, కాంగ్రెస్‌కు చెందిన ప్రధాన జాతీయ ప్రతిపక్ష ముఖంగా రాహుల్ గాంధీ ఎదుగుదల భారత సమకాలీన రాజకీయ చర్చలో ప్రాధాన్యత కలిగిన పరిణామంగా కొనసాగుతుంది.

## జీవ వైవిధ్యం లేకపోతే మానవ మనుగడ లేదు

### - నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** ప్రకృతిలో జీవవైవిధ్యం లేకపోతే మానవ మనుగడ లేదని, ప్రశ్నార్థకంగా మారుతుందని అమర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, విద్యార్థి సంక్షేమ, సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని "శేషాచలం-జీవ వైవిధ్య సజీవ వారసత్వం" అనే అంశంపై వారం రోజుల అవగాహన, సృజనాత్మక కార్యక్రమాలలో బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో జీవ వైవిధ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ లు ముఖ్యఅతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరీనేని రమాదేవి మాట్లాడుతూ ప్రకృతి నియమాలకు ప్రకారంగా అడవులను సంరక్షిస్తూ వాటిలోని విశిష్ట సంపదను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ప్రకృతిని నాశనం చేయడం ద్వారా జీవవైవిధ్యం అసమతుల్యం వలన మానవ మనుగడకే ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ అధ్యాపకులు,విద్యార్థులు సమాజంలోని అన్ని వర్గాలకు పకృతి వైవిధ్యం, జీవవైవిధ్యం, పరిసరాలు వాటి ఆవశ్యకత గురించి సమగ్రంగా వివరించవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. జీవవైవిధ్యం అసమతౌల్యం ఏర్పడితే మానవ మనుగడ అసాధ్యమని హెచ్చరించారు. నేషనల్ బయోడైవర్సిటీ డైరెక్టర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ జియో వైవిధ్యం పై విద్యార్థులకు ఆహ్వాన కల్పించడం మనందరి బాధ్యత అని అన్నారు.వర్సిటీ రెక్టర్ ఆచార్య చంద్రాయుడు, రిజిస్ట్రర్ ఆచార్య భూపతి నాయుడులు మాట్లాడుతూ విద్యార్థులకు వారం రోజులపాటు జీవవైవిధ్యంపై అవగాహన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం ద్వారా వర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టరేట్ చేపడుతున్న కార్యక్రమాలను పట్ల అభినందనలు వ్యక్తం చేశారు. డిఎస్డబ్ల్యూసిఏ డైరెక్టర్ ఆచార్య బివి.మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు జీవవైవిధ్యం,వన్య ప్రాణాల సంరక్షణ విధానం,వాటి ఆవశ్యకత గురించి వారం రోజులపాటు అవగాహన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల, వర్సిటీ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ, పెయింటింగ్ పోటీలను నిర్వహించామన్నారు. డిఎస్డబ్ల్యూసిఏ అసిస్టెంట్ డైరెక్టర్,కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, సాహిత్యం వంటి రంగాలలో పాటు జీవవైవిధ్య సదస్సు నిర్వహించడం ద్వారా వారిలో ప్రత్యేకమైన అవగాహన ఏర్పరిచేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.



# ఉరవకొండలో... మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్...!

- ప్రజల సమస్యలు విన్న మంత్రి..
అధికారులకు పరిష్కార ఆదేశాలు
- అధ్యాపకుడిగా మారిన ఆర్థిక మంత్రి..
విద్యార్థులకు విజయ పాఠాలు
- అవమానాలతో కుంగిపోవద్దు.. వాటినే
విజయానికి మెట్లుగా మార్చుకోండి
- గ్రామీణ విద్యార్థుల సత్తా చాటాలి..
మంత్రి పయ్యావుల పిలుపు



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** నియోజకవర్గ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం ఉరవకొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలను మంత్రి స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన



వినతులను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**లక్ష్యంపై గురి.. విజయంపై తపన ఉండాలి: పయ్యావుల**

అనంతరం ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంత్రి పయ్యావుల కేశవ్ సందర్శించారు. బీకాం మొదటి సంవత్సరం తరగతిలో కొంతసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నిజ జీవితానికి సంబంధించిన అంశాలను వివరించారు. విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే అవమానాలు, ఇబ్బందులతో కుంగిపోకుండా వాటినే విజయానికి మెట్లుగా మలుచుకోవాలని మంత్రి సూచించారు. తాను కూడా పాఠశాల స్థాయిలో ఇటువంటి పరిస్థితులను ఎదుర్కొని, కేవలం మూడు నెలల్లోనే తన సత్తా చాటినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం ఏ రంగంలోనైనా తమ ప్రతిభను నిరూపించుకోగలరని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థిలో విజయం సాధించాలనే తపన ఉండాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

**పాఠశాల కమిటీలతో మంత్రి పయ్యావుల భేటీ**

నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ పాఠశాల కమిటీల చైర్మన్లు, సభ్యులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఉరవకొండ టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందేలా చొరవ చూపాలని సూచించారు. పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# టీడీపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి...

## - ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం...!

- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచన
- కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని పిలుపు
- పార్టీ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన 4వ బుధవారం పార్టీ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.రాబోయే రోజుల్లో పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమాలోచనలు నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కృష్ణకుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు... మంత్రి ఆర్థిక సహాయం...!

- మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** ఉరవకొండ శివారులోని గుంతకల్లు ప్రధాన రహదారిపై ఈ నెల 10వ తేదీ గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలానికి చెందిన జైనుల్లా, మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ మృతి చెందారు.ఈ నేపథ్యంలో బుధవారం ఉరవకొండ పట్టణంలోని రాష్ట్ర ఆర్థిక శాఖ క్యాంపు కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆర్థిక సహాయం అందించారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు.ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.

# ఘనంగా మాజీ శాసనసభ్యులు ఆర్.సాయినాథ్ గౌడ్13వ వర్ధంతి

- మాజీ ఎమ్మెల్యేకు నివాళులర్పించిన గుంతకల్లు నియోజకవర్గం తెదేపా నేతలు

**గుంతకల్ - సూర్య వాస్తవం :** గుంతకల్లు పట్టణం బుధవారంగుత్తి మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు ఆర్.సాయినాథ్ గౌడ్13వ వర్ధంతి సందర్భంగా గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్. జితేంద్ర గౌడ్ ఆదేశాలు మేరకు జితేంద్ర గౌడ్ క్యాంప్ కార్యాలయం నందు గుత్తి మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు సాయినాథ్ గౌడ్ గారి చిత్రపటానికి రామగౌని కుటుంబ సభ్యులు తెదేపా నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ అనంతరం గుంతకల్లు ప్రభుత్వ హాస్పిటల్ నందు తెదేపా సీనియర్ నేత శ్రీనాథ్ గౌడ్ యువనేతలు : ప్రవీణ్ కుమార్ గౌడ్ పవన్ గౌడ్ అనిల్ గౌడ్, తెదేపా నాయకులు గుంతకల్లు ప్రభుత్వ హాస్పిటల్ నందు పేషెంట్లకు పండ్లు,బ్రెడ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణం, రూరల్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



# పీఏబీఆర్ డ్యాం నీరు వదలకుంటే మరణమే శరణ్యం

## - రైతులు ఆవేదన

- సాగునీరు అందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తాం(శైలజానాథ్)
- దద్దరిల్లిన ఎంపిఆర్ డ్యాం పరిసర ప్రాంతం





**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** కరువు తాండవం చేస్తున్న అనంతపురంజిల్లాలో యంపిఆర్ డ్యామ్ కింద గల రైతుల పరిస్థితి తీవ్రమైన దుస్థితి ఏర్పడడంతో రైతులు అయోమయంలో కొట్టుమిట్టలాడుతున్నారని సింగనమల నియోజకవర్గం సమన్వయకర్త మాజీమంత్రి డాక్టర్ శైలజనాథ్ ఆవేదన వ్యక్తపరిచారు. బుధవారం గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల డ్యాం(ఎంపిఆర్)వద్ద పరిశీలనలో భాగంగా వైయస్సార్ సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాటికి నేటికి ఎప్పటికీ రైతుల ద్రోహి అని, వ్యవసాయం దండగని ఏనాడో వాగ్దానం చేశాడని దానిని ఈనాడు అమలపరుస్తున్నాడన్నారు. లేకుంటే తుంగభద్ర డ్యాం నుంచి మనకు రావలసిన వాటా నీరు ఎందుకు తీసుకొని రాలేదని ఆయన నిలదీశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరులేక ఎంపిఆర్ డ్యాం నెర్రలు పోయే దుస్థితికి చేరిందని ఆగ్రహం వ్యక్తపరిచారు. కనీసం త్రాగునీరు కూడా అందించలేని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ఇలాంటి వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు కృత్రిమ వర్షాలు కురిపించి రైతులను ఆదుకున్నారన్నారు. ఎండిపోతున్న చీనీచెట్లను చూసి రైతు గుండెలు బాదుకుంటూ ఎన్నో ఆశలు పెట్టుకున్న వాటిని బ్రతికించుకోవడానికి వాటర్ ట్యాంకుల ద్వారా బిందెడు నీళ్లు పోసి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారంటే ఎంతటి దుర్భరపరిస్థితి ఏర్పడిందో ప్రభుత్వానికి కనిపించలేదాని విమర్శనాస్త్రాలతో ఆగ్రహం వ్యక్తపరిచారు.ఎంపిఆర్ నీటిని నమ్ముకొని గార్లదిన్నె పామిడి పెద్దవడుగూరు సింగనమల యాడికి ఎల్లనూరు మండలాలలో కొన్నివేల





ఎకరాలు వరిపంట సాగు చేసినారని, వర్షాబావ (ఎల్ నినో) ప్రభావంతో వేరుశనగ పంట ద్వంశమైందని, కనీసం ఎంపీఆర్ డ్యాం నుండైనా వారం లోపు సాగునీరు అందించకపోతే కంటికి రెప్పలా కాపాడుకున్న చీనిచెట్లు పూర్తిగా ఎండిపోతాయని, లక్షలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, సింగనమల నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రి మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ ఆవేదనవ్యక్తపరిచారు. ప్రధానంగా రైతులు పడుతున్న సాగునీరు కింద ఉన్న గ్రామాలు పెనకచర్ల,పెనకచర్ల కొత్తపల్లి,కొప్పలకొండ, కేశవాపురం, ఎర్రగుంట్ల, ముంటిమడుగు,కొత్తపల్లి, కల్లూరు, ఇల్లూరు, కల్లమడి, తరిమెల, రాచేపల్లి, కొండూరు చిట్టూరు చిత్రచేడు, గంజిగుంటపల్లి, వీరన్నపల్లి, నాగలాపురం, దేవుని ఉప్పలపాడు,కోనేపల్లి కత్రిమల, పాళ్యం, ఎద్దులపల్లి, అప్పాజీపేట, కండ్లపల్లి, వంకరాజుకాల్వ, పామిడి, గ్రామాల రైతులు వరిపంట సాగు చేస్తున్నారని, వరి పంట పొట్టదశకొస్తున్నా కాలువకు నీరు వదలక పోవడంతో సాగు నీరుకోసం ఎదురుచూస్తున్నారు. వారం లోపల డ్యాం నీరు కాలువలకు విడుదల చేయకపోతే ఆత్మహత్యలు శరణ్యమని రైతులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, వైసిపిమండల కన్వీనర్ ఎల్లారెడ్డి, కార్యదర్శి చీమల శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, వీరయ్య, చిదంబరరెడ్డి, రామాంజనేయులు, పిల్లలరవి, రామకృష్ణ, ఎర్ర గొర్ల ఆంజనేయులు, ప్రసాద్, తదితర నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ఉరవకొండలో జోనల్ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్

- బాలబాలికల విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు
- విజేతలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ ప్రదానం



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** ఉరవకొండ డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో 2026--27 సంవత్సరానికి సంబంధించిన ఉరవకొండ రూరల్ జూడో లీగ్ జోనల్ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బెలుగుప్ప కేజీబీవీ, వజ్రకరూరు జడ్పీహెచ్ఎస్, సెక్షనుపల్లి జడ్పీహెచ్ఎస్, బెలుగుప్ప జూడో క్లబ్, ఉరవకొండ జూడో క్లబ్, ఏవీఆర్ స్కూల్, నిమ్మగల్లు, కొటాలపల్లి జడ్పీ హైస్కూల్ తదితర పాఠశాలలు, జూడో క్లబ్‌లకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో 25 కేజీల విభాగంలో సుగంధన్ గోల్డ్ మెడల్, అరుణ్‌కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు. 30 కేజీల విభాగంలో సాయికిషోర్ గోల్డ్ మెడల్ సాధించగా, 35 కేజీలలో మణికంఠ, 40 కేజీలలో జీవన్, 45 కేజీలలో భరత్, 50 కేజీలలో బాలచంద్ర, 55 కేజీలలో విజయ్‌కుమార్ గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆయా విభాగాల్లో రియాజ్, శివకుమార్, పవన్‌సాయి, ఎం.యశ్వంత్, మను సిల్వర్ మెడల్స్ సాధించారు. ఓపెన్ విభాగంలో చైతన్ విజేతగా నిలిచారు.

బాలికల విభాగంలో 25 కేజీలలో పల్లవి, 27 కేజీలలో ప్రణీత, 36 కేజీలలో జస్మిత, 40 కేజీలలో షర్మిల, 44 కేజీలలో లక్ష్మి, 48 కేజీలలో తనుజ, 52 కేజీలలో వీణ, 57 కేజీలలో నీరజ, 57o కేజీల విభాగంలో రక్షిత గోల్డ్ మెడల్స్ సాధించారు. ఆయా విభాగాల్లో సులోచన, సాహితీ, పవిత్ర, సమంత, తనుశ్రీ, వైష్ణవి, అవంతిక, సుస్మిత సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమంలో షహీన్ సార్, సత్యనారాయణ హెచ్‌ఎం, షాషావలి ప్రిన్సిపాల్, హలీమా పీడీ, సాకే పురుషోత్తం జూడో ఎన్‌ఎస్ కోచ్, రెడ్డప్పరెడ్డి జూడో కోచ్, మారుతి ప్రసాద్ పీడీ, మంజునాథ్ పీడీ, కృష్ణ పీడీ, శివకుమార్ పీడీ, మంజుల పీఈటీ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జోనల్ స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులు అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో నిర్వహించనున్న సెంటర్ జోన్ స్థాయి జూడో పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

## అంకె నగేష్ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని..

# జగన్ దృష్టికి తీసుకెళ్లిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!

- బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ
- అంకె నగేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం కుటుంబానికి పార్టీ తరఫున సహకారం అందిస్తామని భరోసా



**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో అంకె నగేష్ మృతి చెందిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కలిశారు. అంకె నగేష్ కుటుంబానికి జరిగిన అన్యాయం, ఘటనకు సంబంధించిన పరిస్థితులను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తీసుకెళ్లారు. బాధిత కుటుంబ పరిస్థితులను వివరించి, వారికి న్యాయం జరిగేలా అండగా నిలవాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంకె నగేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తమ వంతు సహకారం అందిస్తామని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇచ్చినట్లు ప్రకాష్ రెడ్డి తెలిపారు. అంకె నగేష్ కుటుంబానికి పార్టీ తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.

# మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి 12వ వేతన సవరణ సంఘం(పీఆర్సీ)ను వెంటనే అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్ కార్మి కులను రెగ్యులర్ చేయాలని సీఐటీ యూ నాయకులు డిమాండ్ చేశా రు. ఈ మేరకు బుధవారం గుత్తి మున్సిపల్ కార్యా లయం వద్ద ము న్సిపల్ కా ర్మికులతో కలిసి సీఐటీ యూ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రద ర్శన నిర్వహించి నిరసన తెలిపా రు. ఈ సందర్భంగా సీఐటీయూ మం డల కార్యదర్శి రమేష్,గుత్తి మున్సి పల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షు డు సూరి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కా ర్మికులు అందరిని క్రమబద్ధీకరించా లని,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశా రు. విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి ఉద్యో గం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరి ష్కరించాలని 12వ పీఆర్సీని అమ లు చేయాలని వారు కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఆం దోళన కొనసాగిస్తామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో గుత్తి మున్సి పాలిటీ పారిశుద్ధ్య విభాగం అధ్యక్షు డు సూర్యనారాయణ,కార్యదర్శి రా మాంజ నేయులు,ఉపాధ్యక్షుడు మ హేష్,సహాయ కార్యదర్శి సుంకన్న, ఈశ్వరయ్య, హరి, భాగ్యమ్మ, పెద్దక్క, అనురాధ, లక్ష్మి,వెంకటేష్, బాలకృష్ణ, నాగేష్, సత్యనారాయణ, హరి, సీఐటీయూ అనంతపురం జిల్లా ఉపా ధ్యక్షుడు రమేష్,ఇంజనీరింగ్ విభా గం అధ్యక్షుడు రాజా,కార్యదర్శి రవి శంకర్, నరసింహా, నక్కా శేఖర్,సాది క్, రామకృష్ణ, మత్యాలు, రాజ్ కుమార్ తదితరులు, మున్సిపల్ కార్మికు లు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి పౌరులు..

## - అంగనవాడి సేవలను సద్వినియోగం చేసుకోండి



**కదిరి - సూర్య వాస్తవం :** నేటి బాలలే రేపటి పౌరులని ఐసిడిఎస్ కదిరి ప్రాజెక్టు కుమ్మరవాళ్ళపల్లి 3 సెంటర్ అంగన్వాడి వర్కర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి 3 అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా గర్భవతులు బాలింతలు లబ్ధిదారులు గ్రామస్తుల అందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. పిల్లలకి మిఠాయిలు పంచి పెట్టడం జరిగింది పిల్లల తల్లులకు ఘనంగా సన్మానం చేయడం జరిగింది ప్రభుత్వం ద్వారా అందించే పథకాల గురించి గ్రామస్తులకు లబ్ధిదారులకు వివరించారు. ఈ అంగన్వాడిఉత్సవ ప్రోగ్రాం ప్రతి అంగన్వాడీ కేంద్రంలోనూ మూడు రోజులు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.




- ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు తప్పని అవస్థలు
- వీల్‌చైర్, స్ట్రెచ్చర్ లేక 20 నిమిషాలు అంబులెన్స్‌లోనే రోగి
- కుటుంబ సభ్యులే ఎత్తుకుని అత్యవసర విభాగానికి తరలింపు
- దాతలు అందించిన 25 స్ట్రెచ్చర్లు స్టోర్‌రూమ్‌కే పరిమితం
- రోగుల సేవల కోసం ఇచ్చిన స్ట్రెచ్చర్లు దాచి ఉంచడం లో ఆంతర్యం ఏమిటి ?
- ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా ?

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :**

అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కనీస వసతుల కొరత మరోసారి వెలుగులోకి వచ్చింది. తీవ్ర అనారోగ్యంతో చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన ఓ రోగిని అత్యవసర విభాగంలోకి తరలించేందుకు వీల్‌చైర్, స్ట్రెచ్చర్ అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులే ఎత్తుకుని తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విడపనకల్లు ప్రాంతానికి చెందిన ఓబన్న తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకొచ్చిన అనంతరం సుమారు 20 నిమిషాల పాటు రోగి అంబులెన్స్‌లోనే ఉండాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర విభాగంలోకి తరలించేందుకు స్ట్రెచ్చర్, వీల్‌చైర్ కోసం ప్రయత్నించినా వెంటనే అందుబాటులోకి రాకపోవడంతో చివరకు కుటుంబ సభ్యులే రోగిని ఎత్తుకుని లోపలికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**స్టోర్‌రూమ్‌లోనే స్ట్రెచ్చర్లు?**

ఇదిలా ఉండగా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి దాతల ద్వారా అందిన 25 స్ట్రెచ్చర్లు రోగుల సేవలకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి 25 స్ట్రెచ్చర్లు విరాళంగా అందించినప్పటికీ అవి స్టోర్‌రూమ్‌లోనే ఉన్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగులను అత్యవసర విభాగానికి తరలించేందుకు అవసరమైన సమయంలో స్ట్రెచ్చర్లు అందుబాటులో లేకపోతే, దాతలు అందించిన పరికరాల ఉద్దేశం ఏమిటని రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన పరికరాలు అందుబాటులో లేకపోవడంపై ఆసుపత్రి యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు తక్షణ వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో కనీసం రోగులను తరలించేందుకు అవసరమైన పరికరాలు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని పలువురు అంటున్నారు.

ఆసుపత్రిలో ప్రస్తుతం ఎన్ని వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్లు వినియోగంలో ఉన్నాయి? వాటి నిర్వహణ బాధ్యత ఎవరిది? అత్యవసర విభాగం వద్ద రోగులను తరలించేందుకు సిబ్బంది ఎందుకు అందుబాటులో ఉండరు? దాతలు అందించిన 25 స్ట్రెచ్చర్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి ఎందుకు తీసుకురాలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఈ ఘటనపై ఆసుపత్రి ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించడంతో పాటు, స్ట్రెచ్చర్లు, వీల్‌చైర్లు రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రోగుల కుటుంబాలు కోరుతున్నాయి.

# అనంతపురం నగర అభివృద్ధిలో... దగ్గుపాటి మార్క్...!

- ఒకే రోజు రూ.2.66 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఫుట్‌పాత్‌లు, రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, మైనార్టీ కమిటీ హాల్‌కు భూమిపూజ
- త్వరలో రూ.160 కోట్లతో పనులు చేపడతాం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగర అభివృద్ధికి మరింత ఊపునిచ్చేలా ఒకే రోజు రూ.2.66 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జిల్లా బెస్త సంఘం అధ్యక్షుడు చేపల హరి, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. టవర్ క్లాక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.1.12 కోట్లతో చేపట్టనున్న ఫుట్‌పాత్, రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. రాజా, రమణ, రమేష్ థియేటర్ ప్రాంతంలో రూ.60 లక్షలతో నిర్మించనున్న బాక్స్ కల్వర్టుకు భూమిపూజ చేశారు. లక్ష్మీనగర్ రామాలయం వద్ద రూ.60 లక్షలతో నిర్మించనున్న మైనార్టీ కమిటీ హాల్‌కు కూడా భూమి పూజ నిర్వహించారు. 41వ డివిజన్ తిరుమలనగర్‌లో రూ.8.80 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టు పనులకు, 48వ డివిజన్ రజకనగర్ బ్రిడ్జి వద్ద రూ.17 లక్షలతో సీసీ డ్రైన్, సీసీ రోడ్డు పనులకు ప్రారంభోత్సవం చేశారు. 48వ డివిజన్ శాంతినగర్ 1వ క్రాస్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు, శాంతినగర్ సర్కిల్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. 45వ డివిజన్ సునీతనగర్‌లో రూ.8.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో అనంతపురం నగరంలో రెండేళ్ల కాలంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇటీవలే రూ.107.71 కోట్లతో తాగునీరు, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించామని చెప్పారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ( హెచ్‌ఏఎం ) ద్వారా రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో మరో రూ.160 కోట్లతో నగరంలో రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నగరాభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని... తక్షణం అమలు చేయాలి...!

- న్యాయవాదుల భద్రతే.. న్యాయ హక్కుల పరిరక్షణకు బలం
- విజయవాడలో న్యాయవాదిపై దాడిని ఖండించిన బీసీ న్యాయవాదుల సంఘం




**అనంతపురం - సూర్య వాస్తవం :** న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వేధింపులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణం తీసుకురావాలని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాకే నరేష్ డిమాండ్ చేశారు. బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు న్యాయం అందించేందుకు కోర్టుల్లో నిరంతరం సేవలం దిస్తున్న న్యాయ వాదులు, బాధితులు, నిందితులు సహా వివిధ వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చట్టపరంగా వాదించడం తమ వృత్తిపరమైన బాధ్యతగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే వృత్తి నిర్వహణలో భాగంగా కొంతమంది న్యాయవాదులు వ్యక్తిగత బెదిరింపులు, దాడులు, వేధింపులు, తీవ్ర వృత్తిపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని సాకే నరేష్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవాదులకు సమగ్ర చట్టపరమైన రక్షణ కల్పించడం అత్యవసరమన్నారు. న్యాయ వాదులకు రక్షణ కల్పించడం అంటే కేవలం ఒక వృత్తికి రక్షణ కల్పించడం కాదు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయించే ప్రతి పౌరుడి న్యాయ హక్కులను బలోపేతం చేయడం కూడా” అని సాకే నరేష్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల సంఘాలతో సంప్రదింపులు జరిపి, న్యాయవాదుల భద్రతకు సంబంధించిన సమగ్ర చట్టాన్ని రూపొందించి తక్షణం అమలు చేయాలని కోరారు. ఇటీవల విజయవాడలో న్యాయవాదిపై జరిగిన దాడిని బీసీ న్యాయ వాదుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. న్యాయ వాదులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, మల్లేష్, నాగభూషణ, మంజునాథ్, శ్రీనివాసులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపై శాశ్వత హక్కు కల్పించే పట్టాలు పంపిణీ

**- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్**





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ఉమ్మడి కృష్ణా జిల్లాలో 26,401 మంది పేదలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తో కలిసి రెగ్యుల రైజేషన్ పట్టాలు, కన్వీయెన్స్ డీడ్స్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా ఆస్తిపై పూర్తి హక్కు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత ఆస్తి హక్కు కల్పిస్తూ,వారి కలను సాకారం చేసే చారిత్రాత్మక కార్యక్రమాన్ని మా కూటమి ప్రభుత్వం చేపట్టిందని ఈ పట్టాల ద్వారా రూ 28,110 కోట్ల విలువైన ఆస్తి హక్కులు లబ్ధిదారులకు అందాయి.సగటున ఒక్కో కుటుంబానికి రూ 60 లక్షల నుంచి కోటి రూపాయలకు పైగా విలువైన ఆస్తి హక్కుతో పాటు ఆత్మగౌరవం కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతోందని తెలిపారు. పేదలకు పట్టాభిషేకం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రజా సంక్షేమం పట్ల మా కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు.

## పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి "సత్య కుమార్ యాదవ్"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌గా సమర్థవంతంగా సేవలందించిన డాక్టర్ పద్మావతి గారి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 37 సంవత్సరాల పాటు పబ్లిక్ హెల్త్ విభాగంలో అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజారోగ్య పరిరక్షణకు ఆమె అందించిన సేవలు స్ఫూర్తిదాయకం అని పదవీ విరమణ అనంతరం కూడా ఆమె వైద్య, పరిపాలనా అనుభవం సమాజానికి ఉపయోగపడాలని,ఆమెకు ఆరోగ్యకరమైన,సంతోషకరమైన భవిష్యత్తు అందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్య కుమార్ యాదవ్ భగవంతుడిని కోరారు.

## నేలపట్టు పక్షుల కేంద్రంలో ల్యాండ్ స్కేప్ ప్రాజెక్టుతో అభివృద్ధి కార్యక్రమాలు

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** నేలపట్టు పక్షుల పర్యాటక కేంద్రం అక్టోబర్ మాసం నుండి పర్యాటకుల సందర్శనాలు జరగనున్నాయి. ఈ ఏడాది పక్షుల కేంద్రంలో ల్యాండ్ స్కేప్ ప్రాజెక్టు క్రింద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు ఎఫ్ ఆర్ వో సౌజన్య వెల్లడించారు. బుధవారం సమగ్ర ప్రణాళిక తో చేపట్టేందుకు రెవెన్యూ, వ్యవసాయ,మత్స్యశాఖ,అటవీ శాఖలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు.పక్షుల కేంద్రం, అభయారణ్య పరిసర సముదాయాలు ల్యాండ్ స్కేప్ లో సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారి తెలిపారు.వాటర్ షెడ్ పనులు పరిశీలించారు. అదేవిధంగా భూసారాన్ని మెరుగుపరచడం,సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం,ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా జీవనోపాధి, సామర్థ్యాభివృద్ధిపై శిక్షణ కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ సిబ్బందితోపాటు, పలు శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ కల్కి భగవాన్‌కు కొండెపాటి గంగాప్రసాద్ ఘన నివాళి



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** ప్రముఖ పారిశ్రామికవేత్త,టీడీపీ సీనియర్ నాయకులు కొండెపాటి గంగాప్రసాద్ బుధవారం బత్తలవల్లంలోని ఏకం ఆలయంలో శ్రీ కల్కి భగవాన్ పార్థివ దేహాన్ని సందర్శించి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా గంగాప్రసాద్ మాట్లాడుతూ..శ్రీ కల్కి భగవాన్ ఆధ్యాత్మిక రంగంలో విశిష్ట సేవలు అందించడంతో పాటు వరదయ్యపాలెం ప్రాంత అభివృద్ధికి,స్థానిక ప్రజల సంక్షేమానికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు.ఆయన సేవలు ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆధ్యాత్మికత, మానవతా విలువలను చాటుతూ ఆయన అందించిన సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీ కల్కి భగవాన్ మరణం ఆధ్యాత్మిక, సామాజిక రంగాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

## టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు కలసిన ముని రామయ్య



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి పర్యటనకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసులు టిడిపి తిరుపతి పార్లమెంట్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామదాసు ముని రామయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఆయనను తిరుపతిలోని ప్రైవేటు హోటల్లో ముని రామయ్య మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.అంతకుమునుపు రాష్ట్ర అధ్యక్షుడితో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జెబీ శ్రీనివాస్ కలసి జిల్లాలో కూటమి ప్రభుత్వం,ఆయా పార్టీల నేతల గురించి,స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్,జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఆశావహులు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రావును కలిసేందుకు క్యూ కట్టారు.

# పర్యాటకం--పరిశ్రమలకు సరికొత్త బాట..

- పర్యాటక, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపునివ్వాలి
- ఇరకం ఐలాండ్--బీవీ పాలెం--పులికాట్ ప్రాంతాల్లో మౌలిక వసతులు
- స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించాలి
- తిరుపతి ఎకనామిక్ రీజియన్ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ




**నాయుడుపేట- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలో సహజ వనరులు, పారిశ్రామిక ప్రాంతాలు, రవాణా సౌకర్యాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నందున వాటన్నింటినీ అనుసంధానిస్తూ దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆమె సూచించారు.

స్వర్ణాంధ్రఏ2047 విజన్‌లో భాగంగా తిరుపతి కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన తిరుపతి ఎకనామిక్ రీజియన్ (టీఈఆర్) భాగస్వాముల సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఈఓ, రెవెన్యూ--ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల సమగ్ర ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై చర్చించారు.

**పర్యాటక రంగానికి అపార అవకాశాలు**

సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇరకం ఐలాండ్, బీవీ పాలెం, పులికాట్ సరస్సు, ఫ్లెమింగో ఫెస్టివల్, శ్రీహరికోట వంటి ప్రాంతాలకు విశేషమైన పర్యాటక సామర్థ్యం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఇరకం, బీవీ పాలెం ప్రాంతాల్లో పర్యాటక మౌలిక వసతులు, రిసార్టులు, బోటింగ్ సదుపాయాలు, ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న ఇరకం ఐలాండ్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసి, బోటింగ్, రవాణా, పర్యాటక సదుపాయాలను మెరుగుపరిస్తే అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. 2026 ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఇరకం ఐలాండ్, బీవీ పాలెం తదితర ప్రాంతాలను పర్యాటక కార్యక్రమాలతో అనుసంధానించిన విషయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

**మాంబట్టు, మేనకూరు సెజ్‌లపై ప్రత్యేక దృష్టి**

సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని మాంబట్టు సెజ్, మేనకూరు సెజ్‌లలో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతకు ఆయా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. దీనివల్ల స్థానిక యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.



**లాజిస్టిక్స్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలి**

పోర్టులు, జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న సూళ్లూరుపేట--నాయుడుపేట ప్రాంతాలను ప్రధాన లాజిస్టిక్స్ కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకు అనుకూలమైన భౌగోళిక స్థానం ఉన్నందున ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేస్తే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందని తెలిపారు. పర్యాటకం, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, రవాణా రంగాలను పరస్పరం అనుసంధానిస్తూ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు.

**అధికారులు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం**

ఈ సదస్సులో ప్లానింగ్ విభాగం జాయింట్ సెక్రటరీ అనంత్ శంకర్, జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ఎమ్మెల్యే ప్రతిపాదించిన అంశాలను ఆర్థికాభివృద్ధి ప్రణాళికల్లో పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ సమావేశం ప్రస్తావించింది.

## సీఈసీ తీరుకు వ్యతిరేకంగా

# తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి..

**- హోరెత్తిన కాంగ్రెస్ శ్రేణులు**

**- సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిరణ్ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు**

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ (సీఈసి)జ్ఞానేశ్వర్ రావు సర్ ప్రక్రియ పేరుతో సొంత అజెండాతో వ్యవహరిస్తూ, ఎలక్షన్ కమిషనర్ల సలహాలు, సూచనలు తీసుకోకుండా అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గుర్రం బాబు ఆధ్వర్యంలో బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్‌కి (సర్ ) జరుగుతున్న ఓట్ల తొలగింపు గురించి వినతి పత్రం అందజేశారు కార్యక్రమం ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాల గురవం బాబు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాకు చెందిన ఏడు నియోజకవర్గాల ఇన్చార్జులు, నాయకులు పాల్గొన్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ డి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ..సీఈసీ జ్ఞానేశ్వర్ రావు సర్ పేరుతో లక్షలాది ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారు.ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఎలక్షన్ కమిషనర్ల సలహా కూడా తీసుకోకుండా సొంత అజెండాతో పని



చేస్తున్నారు.ఏఐసీసీ అధ్యక్షులు ఖర్గే గారు,రాహుల్ గాంధీ గారి పిలుపు మేరకు,ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలా రెడ్డి ఆదేశాలతో, మా జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు నాయకత్వంలో ఈ పోరాటం చేస్తున్నాము




కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ దాసరి రత్నం, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలపా దామోదర్ రెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ, జిల్లా కిసాన్ అధ్యక్షులు జోగి వినోద్,కేకేసి జిల్లా అధ్యక్షులు చిరంజీవి,జిల్లా కార్యదర్శి ఇళయరాజా, సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శ్వేత,కార్యదర్శి బొగ్గుల సురేష్, సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి,సూళ్లూరుపేట టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె యాసిన్ భాష తదితరులు పాల్గొన్నారు. సీఈసీ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ‘నువ్వు అద్భుతమైన నటుడివి’..

# ఫహాద్ ఫాజిల్ నటనకు మహేశ్ బాబు ఫిదా

టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్‌ను ప్రశంసల్లో ముంచెత్తారు. దర్శకుడు శశాంక్ ఏలేటి తెరకెక్కించిన ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ సినిమాను చూసిన మహేశ్.. ఫహాద్ అద్భుతమైన నటుడంటూ కొనియాడారు. సినిమా తనకు ఎంతో అందమైన అనుభూతిని ఇచ్చిందని తెలిపారు.సినిమాను చూసిన అనంతరం మహేశ్ బాబు బుధవారం తన ‘ఎక్స్’ ఖాతాలో సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ ఎంతో చక్కగా రూపొందిన సినిమా అని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో వినోదాన్ని అందిస్తూనే మనసును హత్తుకునేలా ఉందని అన్నారు. సినిమా మొత్తం ఒక ప్రత్యేకమైన ఆప్యాయత కనిపిస్తుందని ప్రశంసించారు.సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించిన ఫహాద్ ఫాజిల్, బాలనటి సారాను మహేశ్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఫహాద్ నటుడిగా ఎప్పటికప్పుడు కొత్తగా ప్రయోగాలు చేస్తూ తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగడం స్ఫూర్తిదాయకమని అన్నారు.ఫహాద్, చిన్నారి సారా కలిసి అద్భుతంగా నటించారని మహేశ్ ప్రశంసించారు. సినిమాలో వారి పాత్రలు జీవిస్తున్నట్లు, ప్రతి క్షణాన్ని అనుభవిస్తున్నట్లు కనిపించిందని పేర్కొన్నారు.

**కార్తికేయ, శశాంక్‌కు అభినందనలు**

సినిమా నిర్మాత ఎస్.ఎస్.కార్తికేయను కూడా మహేశ్ బాబు అభినందించారు. ఆయనకు ఇంతకంటే ప్రత్యేకమైన ఆరంభం ఉండదని పేర్కొన్నారు. కార్తికేయ, శోబు కలిసి ఎంతో ప్రత్యేకమైన సినిమాను రూపొందించారని అన్నారు.దర్శకుడు శశాంక్ ఏలేటి పనితీరును కూడా మహేశ్ ప్రశంసించారు. ఒక అందమైన ప్రపంచాన్ని తెరపైకి తీసుకొచ్చిన విధానం అభినందనీయమని అన్నారు. సినిమా మొత్తం టీమ్‌కు ప్రేమ, శుభాకాంక్షలు తెలిపారు. వారి చేతిలో ఒక అద్భుతమైన సినిమా ఉందని పేర్కొన్నారు.

**అక్టోబర్ 2న విడుదల**



‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ను శోబు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని కలిసి ఎస్.ఎస్.కార్తికేయతో నిర్మించారు. స్టార్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి ఈ సినిమాను సమర్పిస్తున్నారు.ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి శశాంక్ ఏలేటి రచన, దర్శకత్వం వహించారు. హమ్జా అలీ సహ రచయితగా ఉన్నారు. కాల భైరవ సంగీతం అందించగా.. ఆస్ట్రేలియన్ సినిమాటోగ్రాఫర్ బ్రాడ్ ఫ్రాన్సిస్ కెమెరా బాధ్యతలు నిర్వహించారు. ప్రవీణ్ ఆంథోని ఎడిటింగ్ చేశారు.ఈ సినిమాకు సంబంధించిన తమిళ, మలయాళ, తెలుగు ట్రైలర్లకు వరుసగా కమల్ హాసన్, మోహన్‌లాల్, బాలకృష్ణ వాయిస్ ఓవర్ అందించారు. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఓటీటీకి మృణాల్ ఠాకూర్

# ‘పూజా మేరీ జాన్’

ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఒక వైపున క్రైమ్ థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కథలు దూసుకుపోతుంటే, మరో వైపున కోర్టు రూమ్ డ్రామాలు తమ జోరును కొనసాగిస్తున్నాయి. క్రైమ్ ను .. సస్పెన్స్ ను టచ్ చేస్తూ కోర్టు రూమ్ డ్రామాలు ఉండటం ఈ కాన్సెప్ట్ లకు కలిసొస్తుంది. బలమైన కథ .. కథనం కలిగిన కంటెంట్ కి ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తోంది. నిడివి ఎక్కువగా ఉన్నప్పటికీ వాళ్లు ఈ తరహా కంటెంట్ పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. స్త్రీ ప్రధానమైన పాత్రలతో ఈ తరహా కంటెంట్ రూపొందుతుండటం ప్రత్యేకంగా కనిపిస్తోంది.అలా స్త్రీ ప్రధానమైన రెండు పాత్రల చుట్టూ తిరిగే కథలో ఒక సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే ‘పూజా మేరీ జాన్’. అక్టోబర్ 2వ తేదీ నుంచి ‘జీ 5’లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ సినిమాలో పూజ పాత్రను మృణాళ్ ఠాకూర్ పోషించారు. ఈ పాత్ర ను కేంద్రబిందువుగా చేసుకునే ఈ కథ నడుస్తుంది.



తన స్నేహితుడు చేసిన లవ్ ప్రపోజల్ ను ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఫలితంగా ఆమె ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? అనే అంశం చుట్టూ సన్నివేశాలను అల్లుకుంటూ వెళ్లారు. ఇక ఇటీవల కాలంలో ఓటీటీ సినిమాలతో .. సిరీస్ లతో హుమా ఖురేషి ఆడియన్స్ కి మరింత చేరువయ్యారు. అలాంటి ఆమె ఈ సినిమాలో లాయర్ ‘సనా’ పాత్రను పోషించారు. పూజకి న్యాయం చేయడం కోసం పోరాడే ఒక ధైర్యవంతురాలైన లాయర్ గా ఆమె ఈ పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు పాత్రలు ఈ సినిమాకి రెండు కళ్లుగా చెప్పుకోవలసి ఉంటుంది. నవజోత్ గులాటి దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఓటీటీ ఆడియన్స్ వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ ను రాబట్టుకుంటుందనేది చూడాలి.



# అక్టోబర్ 30న ‘క్రేజీ కల్యాణం’..

# అనుపమ పెళ్లి సందడి మొదలైందా?

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తెలుగు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘క్రేజీ కల్యాణం’ విడుదల తేదీ ఖరారైంది. బద్రప్ప గజులా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ఆరో సినిమాస్ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమాలోని రెండో పాట ‘అలసెంద్రవంకోలే ఉన్నావే పిల్ల’ ప్రోమోను విడుదల చేసింది.ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. కీర్తి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించనుండగా, ఆమె తండ్రి పాత్రను డాక్టర్ నరేశ్ పోషించారు. కూతురి పెళ్లిని ఘనంగా చేయాలని ఆశపడే తండ్రి చుట్టూ టీజర్‌లోని కథ సాగుతుంది. కూతురికి ఎంత బంగారం కావాలన్నా కొనిస్తానని, నచ్చినన్ని చీరలు తీసుకోవచ్చని, స్నేహితులందరినీ పెళ్లికి పిలవొచ్చని ఆయన చెబుతారు.తన కూతురికి మంచి సంబంధం చూడాలనే ప్రయత్నంలో సోదరుడితోనే ఆయన గొడవకు దిగుతారు. అయితే కీర్తికి మాత్రం తనదైన ఆలోచనలు ఉంటాయి. తన తండ్రిలాగే తాను కూడా మొండిదాన్నేనని అమ్మమ్మతో చెప్పే సన్నివేశం టీజర్‌లో నవ్వులు పూయిస్తుంది. దేవుడిని ప్రార్థిస్తూ తన పెద్ద అల్లుడి కంటే పేదవాడైన మరో అల్లుడు తన సోదరుడికి దొరకాలని నరేశ్ కోరుకునే సన్నివేశం కూడా వినోదాన్ని పంచుతుంది. చివర్లో కీర్తి ఓ వ్యక్తిపై ఎండుమిరపకాయలు విసరడం, ఆమెను పెళ్లి చేసుకునేవాడి పని అయిపోయినట్టేనని అతడు అనడం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.బద్రప్ప గజులా ఈ సినిమాతో దర్శకుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అనుపమతో పాటు అఖిల్ రాజ్ ఉద్దేమరి, డాక్టర్ నరేశ్ విజయకృష్ణ, తరుణ్ భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం అందిస్తుండగా, సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూరుస్తున్నారు. కథ, దర్శకత్వ బాధ్యతలు బద్రప్ప గజులా నిర్వహించగా, శ్రీనివాస రవీంద్ర స్క్రీన్‌ప్లే అందించారు.



# గిల్ డబుల్ ధమాకా.. రోహిత్ హిట్ షో..

# 400+ టార్గెట్‌ను ఊదిపారేసిన భారత్

వెస్టిండీస్ 405 పరుగులు చేసింది.. భారత్ ముందు 406 పరుగుల టార్గెట్ పెట్టింది.. కానీ టీమిండియా బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని చూసి బెదరలేదు. బంతి బంతికీ ఆధిపత్యం చూపించారు. ఒకవైపు రోహిత్ శర్మ సెంచరీతో పునాది వేస్తే.. మరోవైపు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించాడు. కోహ్లీ 29 పరుగులకే వెనుదిరిగినా.. రుతురాజ్ గైక్వాడ్ అండగా నిలవడంతో గిల్ చివరి వరకు నాటౌట్‌గా నిలిచి భారత్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. 43.3 ఓవర్లలో 406/2తో లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా 8 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది.

**405కు సమాధానం 406.. అదీ 43.3 ఓవర్లలో!**

టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు వెస్టిండీస్ బ్యాటర్లు గట్టి సవాల్ విసిరారు. జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలతో చెలరేగడంతో విండీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 405 పరుగులు చేసింది. ఇది వన్డేల్లో వెస్టిండీస్‌కు అత్యధిక స్కోర్. భారత్‌పై కూడా వారి అత్యధిక వన్డే స్కోర్ ఇదే.

కానీ 406 పరుగుల లక్ష్యం భారత్‌కు ఏమాత్రం భారంగా అనిపించలేదు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ మొదటి నుంచే విండీస్ బౌలర్లపై ఎదురుదాడి చేశారు. ఓపెనింగ్ జోడీ ఏకంగా 255 పరుగులు జోడించి భారీ ఛేదనకు బలమైన పునాది వేసింది.

**హిట్‌మ్యాన్ సెంచరీ.. గిల్‌కు డబుల్ ట్రీట్!**

రోహిత్ శర్మ 75 బంతుల్లో 101 పరుగులు చేశాడు. 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అదరగొట్టిన రోహిత్.. వన్డేల్లో తన 35వ సెంచరీని నమోదు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లోనే 12 వేల వన్డే పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన మూడో భారత బ్యాటర్‌గా సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ సరసన నిలిచాడు.రోహిత్ ఔటైన తర్వాత గిల్ తన జోరును మరింత పెంచాడు. 133 బంతుల్లో 223 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో 26 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. 117 బంతుల్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేసిన గిల్.. వన్డే చరిత్రలో అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.




**రెండుసార్లు డబుల్ సెంచరీ.. రోహిత్ తర్వాత గిల్లే!**

గిల్ డబుల్ సెంచరీతో మరో అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో రెండుసార్లు 200 పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ ఘనత రోహిత్ శర్మకు మాత్రమే ఉంది. గిల్ 2023లో న్యూజిలాండ్‌పై తొలిసారి డబుల్ సెంచరీ చేశాడు. ఇప్పుడు గువాహటిలో మరోసారి 200 దాటాడు.అంతేకాదు.. గిల్ 223 పరుగులు వన్డేల్లో ఒక కెప్టెన్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోర్‌గా కూడా నమోదైంది. 62 బంతుల్లో సెంచరీ చేసిన అతడు భారత కెప్టెన్‌గా వేగవంతమైన వన్డే సెంచరీ రికార్డును కూడా అందుకున్నాడు.

**కోహ్లీ నిరాశ.. గైక్వాడ్ అండ**

రోహిత్ ఔటైన తర్వాత విరాట్ కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. అయితే తొలి వన్డేలో సెంచరీతో అదరగొట్టిన కోహ్లీ ఈసారి 29 పరుగులకే వెనుదిరిగాడు. దీంతో భారత్‌కు చిన్న ఎదురుదెబ్బ తగిలినప్పటికీ గిల్‌పై దాని ప్రభావం పడలేదు.కోహ్లీ తర్వాత వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ బాధ్యతగా ఆడాడు. గిల్‌తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు. గైక్వాడ్ 37 బంతుల్లో 31 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు గిల్ చివరి వరకు అజేయంగా నిలిచి 223 పరుగులతో భారత చరిత్రాత్మక విజయానికి హీరోగా మారాడు.

**భారత్ ఖాతాలో చరిత్రాత్మక ఛేదన**

406 పరుగుల లక్ష్యాన్ని 43.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్.. వన్డేల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. ఇంతకుముందు భారత్ అత్యధికంగా 362 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ఇప్పుడు 406 పరుగులతో ఆ రికార్డును భారీగా మెరుగుపర్చింది. 400కుపైగా లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన ప్రపంచంలో రెండో జట్టుగా కూడా భారత్ నిలిచింది.ఇక విండీస్ ఇన్నింగ్స్‌లోనూ రికార్డులే. ఒకే ఇన్నింగ్స్‌లో జాన్ క్యాంప్‌బెల్, షై హోప్, అమీర్ జాంగూ సెంచరీలు చేశారు. విండీస్ వన్డే చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

**రోహిత్ రికార్డుల జోరు**

రోహిత్‌కు ఈ మ్యాచ్ మరో రెండు మైలురాళ్లను అందించింది. 12 వేల వన్డే పరుగుల క్లబ్‌లోకి చేరిన అతడు ఈ మార్క్‌ను 282 ఇన్నింగ్స్‌ల్లో అందుకున్నాడు. విరాట్ కోహ్లీ 242 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించగా.. రోహిత్ రెండో వేగవంతమైన భారత బ్యాటర్‌గా నిలిచాడు.భారత గడ్డపై వన్డేల్లో 200 సిక్సర్లు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కూడా రోహిత్ నిలిచాడు. దీంతో గువాహటి మ్యాచ్ అతడి రికార్డుల జాబితాలో మరో ప్రత్యేక అధ్యాయంగా మారింది.




# ఆర్చరీలో చరిత్ర సృష్టించిన భారత ప్లేయర్లు.. మరో గోల్డ్ కైవసం

ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆర్చరీలో నేడు భారత్‌కు స్వర్ణాల పంట పండింది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు ఫైనల్‌లో చైనాను చిత్తు చేసి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ క్రమంలో దక్షిణ కొరియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. అదే జోరులో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సాహిబ్ జాదవ్, చికితా తానివర్తి జోడీ స్వర్ణం గెలిచింది. ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్‌కు అర్హత కూడా సాధించి భారత్‌కు రెట్టింపు ఆనందాన్ని అందించింది.ఇతర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల స్క్వాష్‌లో తన్వి ఖన్నా, అనహత్ సింగ్‌లతో కూడిన జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లి మరో పతకాన్ని ఖాయం చేసింది. అథ్లెటిక్స్ ఈవెంట్లు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి రెజ్లర్లు, బాక్సర్లు, ఆర్చర్లపైనే ఉంది.హాకీలో భారత మహిళల జట్టు ఫైనల్‌లో స్థానం కోసం దక్షిణ కొరియాతో తలపడనుంది. స్టార్ జూడోకా అస్మితా దేయ్ కూడా బరిలోకి దిగనుంది. నిన్న మహిళల ట్రాప్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన నీరూ ధండా, నేడు మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్, టీమ్ ఈవెంట్‌లో పోటీపడనుంది.

# హిట్‌మ్యాన్ ఉచకోత

గువాహటి: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ బ్యాట్‌తో అదరగొట్టాడు. గువాహటి వేదికగా సాగుతున్న మ్యాచ్‌లో హిట్‌మ్యాన్ దూకుడుగా ఆడి శతకం పూర్తి చేశాడు. రోహిత్ కేవలం 72 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 సిక్సులు ఉన్నాయి. బౌండరీలతో విండీస్ బౌలర్లపై విరుచుకుపడిన రోహిత్.. తనదైన స్టైల్‌లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ సెంచరీతో రోహిత్ శర్మ వన్డేల్లో 35వ శతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.



# స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యల పట్ల ఎన్జీఓ ప్రెసిడెంట్ వినతి



**ప్రొద్దుటూరు -సూర్య వాస్తవం :** స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ తుతిక శ్రీనివాస్ విశ్వనాథ్‌కి ప్రొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు, జెఏసి ఛైర్మెన్ జె.రామసుబ్బయ్య యాదవ్ వినతి పత్రం సమర్పించారు. ఏపీ యన్ జి జి ఓస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇచ్చిన వినతిపత్రం లో సచివాలయం లో దాదాపు సంవత్సరం నుండి స్టేషనరీ సప్లయ్ చేయడంలేదని, స్వర్ణ వార్డు ఉద్యోగుల క్యాజువల్ లీవ్స్ మంజూరు కొరకు ఒక సెక్షన్ అధికారిని నియమించాలని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జి ఓ నెం.7 ను త్వరితగతిన అమలుపరుచాలని తెలిపారు. ఇందుకు కమిషనర్ మాట్లాడుతూ నాకు ఏపీ యన్ జి జి ఓస్ అసోసియేషన్ సంఘం అంటే నాకు చాలా గౌరవం నేను కూడా అక్కడి నుండి వచ్చినవాడినే, అలాగే స్వర్ణ వార్డు ఉద్యోగుల సమస్యలను ఎప్పటికీ అప్పుడు పరిష్కరించడంలో ముందు ఉంటానని, వాటిని ఒకటి రెండు రోజులలో పరిష్కరిస్తానని తెలిపారు. అందుకు ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు జె.రామసుబ్బయ్య యాదవ్ సమస్యల పరిష్కారం దిశగా హామి ఇవ్వడంతో హర్షం వ్యక్త పరిచినారు. కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ గతంలో తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం యం పి డి ఓ గా పనిచేయు సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 30-09-2014 వ తేదీన ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రోజు ఆ రోజులలో వృద్ధాప్య, వితంతు, అంగవైకల్యం, మూగ,చెవిటి వివిధ రకాల పింఛను పేరు "సామాజిక భద్రత పింఛను" గా పిలిచేవారు. అప్పుడు శ్రీనివాస్ విశ్వనాథ్ ఆ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి కి మీరు ప్రజలకు సంక్షేమం కోసం వివిధ రకాల పింఛను ఇస్తున్నారు కాకపోతే ముఖ్యమంత్రి కి దృష్టికి నాయొక్క విన్నపంగా ఒక విషయం తెలియజేయాలని అనుకొంటున్నానని అన్నపుడు వారు చెప్పండి అనగా యం పి డి ఓ శ్రీనివాస్ విశ్వనాథ్ మన ప్రభుత్వం ఇస్తున వివిధ రకాల పింఛను పేరు " ఎన్టీఆర్ భరోసా " గా పేరు మార్పు గా చేస్తే బాగుంటుందని తెలపడం జరిగింది. అది కాస్త కార్య రూపందాల్చి ప్రభుత్వం జి ఓ విడుదల చేయడమైనది. ఇదే రోజున ఆ రోజు ప్రభుత్వం, ఈరోజు కూటమి ప్రభుత్వం ఒకటే కావడం పుష్కర కాలం అంటే 12 సంవత్సరాలు 30-09-2026వ తేదీ అయిన సందర్భంగా కమిషనర్ అపరజ్ఞాని, అపర ఛాన్యుకుడు, దేశ రక్షణలో ఒక మాజీ సైనికుడు,ఉద్యోగ ధర్మం లో ఎక్కడ మచ్చలేని, అవినీతికి తావులేకుండా జీవిస్తున్న మన ప్రస్తుత ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ తుతిక శ్రీనివాస్ విశ్వనాథ్ కి ప్రొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు, జెఏసి ఛైర్మెన్ జె.రామసుబ్బయ్య యాదవ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు మరియు ప్రత్యేక ధన్యవాదములు తెలిపినారు. తదుపరి కమిషనర్ కి శాలువ, బొక్కెతో సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్స్ నాగార్జున, వరప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, ఓంకార్, నరసింహ,పీరయ్య, కిరణ్ , వెంకటనారాయణ, పరబ్రహ్మం , ప్రశాంత్ నాయుడు మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశం



**రాయచోటి-సూర్య వాస్తవం:** రేపు జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజోలు ఎమ్మెల్యే, రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త దేవర వరప్రసాద్ పాల్గొన్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 44 వార్డులలో ఏ ఏ వార్డులలో జనసేన పార్టీకి ఎంత బలం ఉంది, ఎన్ని వార్డులకు ఎవరెవరిని మున్సిపాలిటీ ఎన్నికల బరిలో దింపాలన్న అంశంపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఆయా అవార్డులకు అర్హులైన కౌన్సిలర్ అభ్యర్థులనుసమన్వయకర్త గుర్తించినట్లు తెలిసింది. పోటీ చేసిన స్థానాలలో గెలిచి చీరాలంటూ జనసేన పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నుండి యువత తమను తాము కాపాడుకోవాలి







**రాయచోటి-సూర్య వాస్తవం:** భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు, దేశంలో యువత చెడు మార్గంలో నడవకుండా వారు బంగారు బాట వేసుకున్న వాళ్ళనని దేశాన్ని యువతను పీడిస్తున్న మత్తు పదార్థాలు నుండి యువత తమను తాము కాపాడుకుంటూ యవ్వన జీవితాల్లో చెడును విసర్జించాలని చెప్పిన శాము భారత్ అభియాన్ పథకం కింద రాయచోటి మండల పరిధిలోని సుండుపల్లి రోడ్డు లో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థుల కోసం భారత అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమము చేపట్టి పాఠశాలల్లోని పిల్లలకు ఈ మాదకద్రవ్యాలు వాడకం వల్ల వచ్చే లక్షణాలు వ్యసనానికి బానిస అయిన వారికి మరి ప్రభుత్వం తీసుకునే కఠినమైన చర్యలను దీనికి వ్యతిరేకంగా ఉన్న చట్టాలను పిల్లలకు వివరించడం అయినది. ఇందులో ప్రిన్సిపల్ ఇన్ రేఖ పిల్లను ఉద్దేశించి డ్రగ్స్ కు దూరంగా ఉండాలని తెలియజేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం ఈగల్ క్లబ్ మెంబర్ శ్రీనివాసులు మరి టోల్ ఫ్రీ నెంబర్ 1972 అలాగని ప్రభుత్వం చేపడుతున్న వివిధ చర్యలు చట్టాల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ యువత భవితకు ఒక అడ్డు వాడికి దూరంగా ఉండవలనని సూచించడం జరిగింది. అలాగనని వారికి ప్రతిజ్ఞ కూడా చేయించారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు ఈగల్ టీం మెంబర్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రోగ్రాం ఆఫీసర్స్ యూనిట్ 1, 2 పాల్గొన్నారు.

## రైతుల సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ ఛైర్మన్



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:**

అన్నమయ్య జిల్లా రాయచోటిలో వ్యవసాయ శాఖ ల్యాబ్ టెస్టింగ్ కార్యాలయంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, పంటలకు గిట్టుబాటు ధరలు వంటి అంశాలపై చర్చించారు. అదేవిధంగా సెప్టెంబర్ 29, 30 తేదీల్లో రాయచోటి మార్కెట్ యార్డులో వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, ఎగుమతిదారులు, కోల్డ్ స్టోరేజ్ యజమానులతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఐ హెచ్ డి పి ద్వారా అందుబాటులో ఉన్న సుమారు రూ.60 వేల కోట్ల ప్రైవేట్ పెట్టుబడి అవకాశాలపై సమావేశంలో చర్చిం చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభి వృద్ధికి కూటమి ప్రభుత్వం సహాయ సహ కారాలు అందిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులు, మార్కెటింగ్ అవకాశాలు పెరిగితే రైతులకు మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీలతతో పాటు రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, ఎగుమతి దారులు, స్టోరేజ్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా అవకతవకలపై... సమగ్ర విచారణ జరపాలి...!

**- అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి**
**- కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి**
**- సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్**




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో చదువుల రామయ్య భవనం నుంచి నాలుగు స్తంభాల మండపం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకుండా పోతే వారి ఓటు హక్కుకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటించాలని, అభ్యంతరాలు స్వీకరించి వాటిని నిష్పక్షపాతంగా పరిశీలించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన పౌరుల ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. అనంతరం నాయకులు నాలుగు స్తంభాల మండపం వద్ద ధర్నా నిర్వహించి తమ డిమాండ్లను వెల్లడించారు. సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి

**పత్తికొండ- సూర్య వాస్తవం :** గ్రామీణ ప్రాంతాలలో యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు యువత సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ యువతకు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ మండల జనరల్ బాడీ సమావేశం పత్తికొండ సిపిఐ కార్యాలయంలో మండల కార్యదర్శి సిద్దు అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు, ఉపాధి లేక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని, చదువు పూర్తి చేసుకున్న యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారుతున్నారని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని గాలికి వదిలేస్తున్నారని, ఉపాధి చూపించని వారికి, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలనుండి ఇవ్వకుండా నిరుద్యోగుల గొంతు నొక్కుతూన్నారని వారు వాపోయారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైనటువంటి ఆలూరు నియోజకవర్గంలో పంటల పరిరక్షణ కోసం జింకల పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి,వాటిని విస్మరించి యువతను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వాలపై పోరాటానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్ మాట్లాడుతు అక్టోబర్ 3న జరిగే నిర్మాణ మహాసభలో జిల్లా అభివృద్ధికి అనేక తీర్మాణాలు చేసి భవిష్యత్ పోరాటం నిర్వహిస్తామని కావున యువత అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు పెద్దయ్య, ఉపేంద్ర ఆచారి, అల్తాఫ్, రవి, జనార్ధన్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.




## ఉత్తమ రైతులను సన్మానం చేసిన ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**డోన్- సూర్య వాస్తవం :** నియోజకవర్గ పరిధిలో ఉత్తమ రైతులకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాయలసీమను ప్రపంచ స్థాయి హార్టీకల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక అమలుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఉద్యాన సాగును 8.4 లక్షల హెక్టార్ల నుంచి 2030 నాటికి 14.41 లక్షల హెక్టార్లకు, ఉత్పత్తిని 222 లక్షల టన్నుల నుంచి 435 లక్షల టన్నులకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో రైతులు, ఉద్యానవన రంగానికి కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, సాగునీరు, ఉద్యానవన రంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రాయలసీమ సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతోందన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు రూ.10,014 కోట్లు, సమగ్ర అభివృద్ధికి రూ.లక్ష కోట్ల ప్రణాళికలు రూపొందించడం ప్రాంత అభివృద్ధికి కీలక ముందడుగు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది రైతులు కూటమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిటీ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థుల విజయం

**- పత్తికొండ మండలంలోని పలుచోట్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా సీపీఐ అభ్యర్థులు ఎన్నిక**

**పత్తికొండ- సూర్య వాస్తవం :** పత్తికొండ: పత్తికొండ మండలంలోని పలు పాఠశాలల్లో నిన్న జరిగిన విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎన్నికైన విద్యా కమిటీ ప్రతినిధులను సీపీఐ జిల్లా కార్యదర్శి బీ. గిడ్డయ్య అభినందించారు. పత్తికొండ పట్టణంలోని ఎంపీపీ ఉర్దూ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా ఎం. ఖాన్, ఏపీ మోడల్ స్కూల్ వైస్ చైర్మన్‌గా ఎన్. రామాంజినమ్మ ఎన్నికయ్యారు. పందికోన ఎంపీ యూపీ పాఠశాల వైస్ చైర్మన్‌గా ఎం. మహానందమ్మ ఎన్నికయ్యారు. మండ్రోపేట బాలబాలికల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా శివ, వైస్ చైర్మన్‌గా జె. హారిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యా కమిటీలలో ఎన్నికైన వారు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడం, పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ నాయకులు సూచించారు. ఈ సందర్భంగా బుధవారం పత్తికొండలోని చదువుల రామయ్య భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉమ్మడి మాజీ జిల్లా కార్యదర్శి భీమ లింగప్ప, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాసు, నెట్టికంటయ్య, మండల సహాయ కార్యదర్శి జె. కాశీం, ఏఐటీయూసీ నాయకులు మాదన్న, శాఖ కార్యదర్శి రవి,చిన్న ముని కౌలిట్లయ్య హరి.పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : 9885404140

# ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో... ఆకట్టుకున్న డ్రోన్ ఫ్లై షో...!

**- గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ" ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**- డ్రోన్ల వినియోగంతో సాగు ఖర్చులు తగ్గే అవకాశం ఎంపీ**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో బుధవారం రాత్రి "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్" ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ పాల్గొని డ్రోన్ ఫ్లై షోను ప్రారంభించారు. డ్రోన్ ఫ్లై షో ద్వారా ఉద్యాన రంగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రాయలసీమ అభివృద్ధి అవకాశాలపై అవగాహన కల్పించే దృశ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి ఉద్యాన రంగం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉద్యాన పంటల ద్వారా మెరుగైన ఆదాయం సాధించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమలోని అనుకూల వాతావరణ పరిస్థితులు, రైతుల అనుభవం, భౌగోళిక ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకుని ఈ ప్రాంతాన్ని లి"గ్లోబల్ హార్టికల్చర్ హబ్"లిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్లు, ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియో గించడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు తగ్గడంతో పాటు ఉత్పాదకత పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తే ఉద్యాన రంగం మరింత అభివృద్ధి చెందు తుందని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రాయలసీమ రైతుల అభ్యున్నతికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



## రామసాగరంలో అభివృద్ధి పనులకు భూమిపూజ...





**బెళుగుప్ప- సూర్య వాస్తవం:** మండలంలోని రామసాగరం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు, పశు వుల షెడ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను అధికారులు, టీడీపీ నాయకులు, గ్రామస్థుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఏపీవో, టీఏ, పంచాయతీరాజ్ శాఖ ఏఈతో పాటు టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## కల్లూరు గ్రామ సచివాలయంలో వైద్య సేవలు




**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామ సచివాలయంలో కార్యదర్శి (పిడిఓ) మోతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్య కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు రాధమ్మ, మాధురిలు వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం, గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని అందులో భాగంగా బీపీ షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి వల్ల కలిగే జబ్బులను నష్టాలను సూచించారు. వారితోపాటు ఆ ప్రాంతంలో వృద్ధులకు, గర్భిణీలకు ప్రత్యేక పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఓ(పిడిఓ) మోతిరెడ్డి, విఆర్ఓ రవి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాడర్‌కు గుర్తింపు.. పార్టీ బలోపేతమే లక్ష్యం

**- మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రాంరెడ్డి**
**- నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి : వై.నైరుతి రెడ్డి**



**గుంతకల్లు- సూర్య వాస్తవం :** వైఎస్సార్‌సీపీ సంస్థాగత బలోపేతానికి క్షేత్రస్థాయి నుంచే పునాది వేయాలని ఆ పార్టీ గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి వై. వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల మధ్య నిరంతరం ఉండాలని నాయకులు కార్యకర్తలకు సూచిం చారు. పట్టణంలోని వైఎస్ఆర్ క్యాంప్ కార్యాల యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా వివిధ స్థాయిల నాయకులకు పార్టీ గుర్తింపు ఐడీ కార్డుల పంపిణీ చేపట్టారు. వై. వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు స్థాయిలకు చెందిన నాయకులకు ఐడీ కార్డులు అందజేశారు. నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు ప్రతి స్థాయి నాయకుడు క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీకి గ్రామం, వార్డు స్థాయిలో బలమైన వ్యవస్థ ఉంటేనే ప్రజా సమస్యలను సమర్థవంతంగా గుర్తించి వాటిపై స్పందించగల మన్నారు. నాయకులు కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య నిరంతరం ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావడం, వాటి పరిష్కారం కోసం కృషి చేయడం ప్రతి నాయకుడి బాధ్యతగా భావించాలన్నారు.

పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని, గ్రామాలు, వార్డుల్లో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల మధ్య పరస్పర సమన్వయం పెంపొందించుకుని పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలు, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయి నాయకత్వం కీలక పాత్ర పోషించాలని వై. వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తే పార్టీ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి మాట్లాడుతూ సంస్థాగత కార్యక్రమాల్లో నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. వార్డు, గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఐడీ కార్డుల పంపిణీతో వివిధ స్థాయిల్లో పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయ కులకు సంస్థాగత గుర్తింపు మరింత స్పష్టంగా ఏర్పడిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహిం చేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకునే దిశగా కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ, పట్టణ మండల గ్రామ వార్డు స్థాయి నాయకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వార్డు ఇన్‌చార్జులు మాజీ సర్పంచులు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## ఎరువుల షాపులను తనిఖీ చేసిన జిల్లా అధికారులు



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో ఉన్నటువంటి ఎరువుల షాపులను జిల్లా అసిస్టెంట్ వ్యవసాయ అధికారి విద్యావతి నేతృత్వంలో మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, డిఆర్సీ కె.లక్ష్మీనరసింహులు పామిడిలోని శివసాగర్ షాపులో పురుగుమందుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు.

# పల్లె పండుగ 3.0 ప్రోగ్రాంకు హాజరైన

**గుత్తి, పామిడి మండలాల ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్**
**రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్**

**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి మండలం బేతపల్లి గ్రామం నం దు పల్లె పండుగ 3.0 ప్రోగ్రాంలో ము ఖ్య అతిథులుగా హాజరైన గుంతక ల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి మరియు పామిడి మండలాల ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈ శ్వర్ మరియు రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముందుగా బేతపల్లి తెలు గుదేశం పార్టీ గ్రామ ప్రజలు ఘనస్వా గతం పలికారు అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పల్లె పండుగ 3.0 15 లక్షల రూపాయలతో సిసి రోడ్లకు భూమి పూజ మరియు శంకుస్థాపన చేశారు అనంతరం యువనేత ఈ శ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లె ల అభివృద్ధి చెందా లంటే ఒక్క కూట మి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుం దని తెలిపారు. అలాగే ఈరోజు బేత పల్లి గ్రామం నందు 15 లక్షల రూపా యలతో సీసీ రోడ్లకు భూమి పూజ మరియు శంకుస్థాపన చేయడం జరి గింది. పల్లెలో మరియు పట్టణాల అ భివృద్ధి చెందాలంటే ఒక మన కూట మి ప్రభుత్వానికి సాధ్యమవుతుం దని తెలిపారు. అదేవిధంగా స్థానిక సంస్థ ఎలక్షన్ లో కూటమి ప్రభు త్వం నుంచి ఎవరు పోటీ చేసిన అ ఖండ మెజార్టీతో గెలిపించుకొని తీ రాలని తెలిపారు. బేతాపల్లి గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఈరోజు 15 లక్షల రూపాయలతో సీసీ రోడ్డుకు భూమి పూజ శంకుస్థాపన చేయడం చాలా సంతోషకరంగా ఉందని తెలి పారు. గత 30 సంవత్సరాల నుంచి ఎంతమంది నాయకులు వచ్చిన ఇ క్కడ రోడ్డు వేయలేదు ప్రజా దర్బార్ నిర్వహించినప్పుడు మా గ్రామ ప్రజ లు మాకు రోడ్డు కావాలని అర్జీ పెట్ట డంతో స్పందించిన ఎమ్మెల్యే గుమ్మ నూరు జయరాంకి మరియు యువ నేత గుమ్మనూరు ఈశ్వర్ కి హృద యపూర్వక ధన్యవాదములు తెలి యజేస్తున్నాము అలాగే బేతపల్లి గ్రా మంలో సర్పంచ్ మరియు ఎంపీటీసీ లను అఖండ మెజార్టీతో గెలిపించు కొని ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాంకి బహుమతి అందజేస్తామని సభ ముఖంగా తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికా రులు మరియు బేతపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, గుత్తి మండలం, పట్టణ కూటమి నాయకులు కార్య కర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



## తహశీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఎలు ఉరితాడు వేసుకొని నిరసన

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధ వారం ఉరితాడే తమకు శరణ్యమని గుత్తి వీఆర్ఎల సంఘం అధ్యక్షుడు సుధాక ర్ వాపోయారు. 15వ రోజు వీఆర్ఎలు ఉరితాడు వేసు కొని నిరసన చేపట్టారు. వీఆ ర్ఎలకు పేస్కేల్ అమలు చే యాలని సుధా కర్ డిమాండ్ చేశారు. అర్హులకు ప్ర మోషన్స్ ఇవ్వాలని, కారుణ్యని యామకాలు చేపట్టాలని, పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎలకు, తదితరులు పాల్గొన్నారు.

